తెలంగాణ TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
వరంగల్ | బుధవారం - 22- ఏప్రిల్ 2026 | సంపుటి : 3 | సంచిక : 324 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

# సైబర్ నేరాలపై కట్టడి

## బ్యాంకింగ్ వ్యవస్థలో సంస్కరణలకు సజ్జనార్ సూచనలు
## మ్యూల్ అకౌంట్లపై కఠిన చర్యలకు ప్రతిపాదనలు
## ఆర్బీఐకు కీలక లేఖ.. కేవైసీ లోపాలపై ఆందోళన
## ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక



**హైదరాబాద్, ఏప్రిల్ 21 (తెలంగాణ ముచ్చట్లు):**
సైబర్ నేరాల పెరుగుదలను అరికట్టేందుకు హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ వి సి సజ్జనార్ కీలక సూచనలు చేశారు. దేశవ్యాప్తంగా పనిచేస్తున్న సంఘటిత సైబర్ ముఠాలను అణిచివేయాలంటే బ్యాంకింగ్ వ్యవస్థలో మార్పులు అత్యవసరమని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన భారతీయ రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రాకు విపులమైన లేఖ రాశారు.
ఈ లేఖలో ముఖ్యంగా 'మ్యూల్ అకౌంట్లు' సైబర్ మోసాల కేంద్రంగా మారుతున్నాయని ఆయన వివరించారు. అమాయకుల పేర్లపై అకౌంట్లు తెరచి వాటిని నేరాలకు ఉపయోగిస్తున్న సంఘటనలు పెరుగుతున్నాయని తెలిపారు. హైదరాబాద్ పోలీసుల 'ఆపరేషన్ ఆక్టోపస్' దర్యాప్తులో ఈ అంశాలు వెలుగులోకి వచ్చాయని పేర్కొన్నారు. బ్యాంకుల్లో కేవైసీ ధృవీకరణలో ఉన్న లోపాలు, శాఖ స్థాయిలో జరుగుతున్న నిర్లక్ష్యం వల్లే ఈ సమస్యలు తీవ్రతరమవుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల అన్ని వాణిజ్య బ్యాంకులకు ఆర్బీఐ కఠిన మార్గదర్శకాలు జారీ చేయాలని, శాఖ స్థాయి అధికారుల బాధ్యతను నిర్ధారించాలని సూచించారు.
కొన్ని సందర్భాల్లో బ్యాంకు సిబ్బందే సైబర్ నేరగాళ్లతో కుమ్మక్కవుతున్నారని ఆయన ఆరోపించారు. మహారాష్ట్రలోని నాసిక్‌లో ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ శాఖలో జరిగిన ఘటనను ఉదాహరణగా చూపుతూ, ఉద్యోగి సహచరుల వివరాలను దుర్వినియోగం చేసి మ్యూల్ అకౌంట్లు సృష్టించినట్లు తెలిపారు.

మిగతా 2లో



## ముఖ్యమంత్రిని కలిసిన ఆదాయపు పన్ను ఉన్నతాధికారులు

**జూబ్లీ హిల్స్ నివాసంలో మర్యాదపూర్వక భేటీ**
**కొత్తగా నియమితులైన ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ పరిచయం**
**పరిపాలన అంశాలపై చర్చ**

**హైదరాబాద్, ఏప్రిల్ 21 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిను జూబ్లీ హిల్స్‌లోని ఆయన నివాసంలో ఆదాయపు పన్ను శాఖ ఉన్నతాధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ సురేష్ బత్తినితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. ఇటీవలే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సురేష్ బత్తిని ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని కలిశారు. కొత్త బాధ్యతల నేపథ్యంలో అధికారిక పరిచయ సమావేశంగా ఈ భేటీ జరిగింది.
ఈ సందర్భంగా ఆదాయపు పన్ను శాఖ కార్యకలాపాలు, పరిపాలనకు

మిగతా 2లో

## అడ్వాన్స్‌డ్ తయారీ రంగంలో పెట్టుబడులకు తెలంగాణకు ఆహ్వానం

- ఇటలీ పారిశ్రామికవేత్తలకు మంత్రి శ్రీధర్ బాబు పిలుపు
- సహకారం కోసం వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు హామీ
- పెట్టుబడులు, సాంకేతిక భాగస్వామ్యంపై చర్చ

హైదరాబాద్, ఏప్రిల్ 21 (తెలంగాణ ముచ్చట్లు): అడ్వాన్స్‌డ్ తయారీ రంగంలో పెట్టుబడులకు తెలంగాణ అనుకూల రాష్ట్రంగా ఉన్నదని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఇటలీ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించారు. హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ఆయన ఈ మేరకు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా తెలంగాణలో ఉన్న పారిశ్రామిక అవకాశాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులకు అనుకూల విధానాలను మంత్రి వివరించారు. ఆధునిక తయారీ రంగంలో భాగస్వామ్యంతో ఇరు దేశాల మధ్య ఆర్థిక సంబంధాలు బలోపేతం అవుతాయని తెలిపారు.

మిగతా 2లో





## జగద్గిరిగుట్ట కోనేరుకు కొత్త జీవం

- ఆక్రమణల తొలగింపుతో పునరుద్ధరణ
- హైడ్రా చర్యలతో కోనేరుకు పునర్జన్మ
- ఆక్రమణలు, పూడిక తొలగింపు పనులు పూర్తి
- 22 ఏళ్ల పోరాటం ఫలించిందని భక్తుల ఆనందం

**హైదరాబాద్, ఏప్రిల్ 21 (తెలంగాణ ముచ్చట్లు):** జగద్గిరిగుట్టలోని కోనేరును ఆక్రమణల నుంచి విముక్తి కల్పిస్తూ హైడ్రా కీలక చర్యలు చేపట్టింది. అనేక దేవాలయాలకు కేంద్రంగా ఉన్న ఈ కోనేరు కబ్జాకు గురవుతుండటంపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించిన అధికారులు, మంగళవారం భారీ స్థాయిలో శుభ్రపరిచే పనులు నిర్వహించారు. కోనేరులో పేరుకుపోయిన పూడిక, చెత్త, నిర్మాణ వ్యర్థాలను తొలగించి నీటి ప్రవాహాన్ని పునరుద్ధరించారు. దాదాపు 26 ట్రక్కుల చెత్తను తరలించి కోనేరుకు కొత్త రూపాన్ని తీసుకువచ్చారు. ఒక ఎకరం వరకు విస్తరించిన ఈ కోనేరును కొందరు మట్టితో నింపి పార్కింగ్ స్థలంగా వినియోగించుకుంటున్నట్లు గుర్తించి, ఆ ఆక్రమణలను పూర్తిగా తొలగించారు.
ఈ చర్యలతో కోనేరును పూర్తిగా ఆక్రమించాలన్న ప్రయత్నాలకు అడ్డుకట్ట పడింది. కోనేరును పునరుద్ధరించే కార్యక్రమాన్ని కూడా అధికారులు ప్రారంభించారు. దీంతో స్థానిక ప్రజలు, భక్తులు ఆనందం వ్యక్తం చేస్తూ హైడ్రా చర్యలను అభినందించారు. గోవిందరాజుల స్వామి ఆలయ పూజారి నరహరి మాట్లాడుతూ, కోనేరును కాపాడాలని తాను ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్నానని తెలిపారు. ఈ సమస్యపై సామాజిక మాధ్యమాల్లో స్పందించిన తరువాత అధికారులు చర్యలు తీసుకోవడం సంతోషకరమని పేర్కొన్నారు.
22 సంవత్సరాలుగా కొనసాగిన తన పోరాటం ఫలించిందని నరహరి భావోద్వేగంగా చెప్పారు.

మిగతా 2లో

## తెలంగాణలో ఆర్టీసీ సమ్మె సైరన్

- అర్ధరాత్రి నుంచి స్తంభించనున్న రవాణా వ్యవస్థ
- సమ్మెకు పిలుపునిచ్చిన ఆర్టీసీ జేఏసీ
- చర్చల విఫలం
- బుధవారం ఉదయం నుంచే నిలిచిపోనున్న బస్సులు
- ప్రభుత్వం అప్రమత్తం - ప్రయాణికుల ఇబ్బందులపై ఆందోళన

2లో





## రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

- నల్లగొండలో ధాన్యం సేకరణపై సమీక్ష
- యుద్ధ ప్రాతిపదికన కొనుగోళ్లకు మంత్రి ఆదేశాలు
- రవాణా, నిల్వలపై ప్రత్యేక దృష్టి
- సమయానికి రైతుల ఖాతాల్లో చెల్లింపులు లక్ష్యం

2లో

## వడ్డెరుల అభివృద్ధికి ప్రభుత్వం అండ

- మంత్రి కోమటిరెడ్డి హామీ
- నల్లగొండలో అఖిలభారత వడ్డెర సంఘం సమావేశం
- పెండింగ్ బిల్లుల విడుదలపై వివరాలు
- నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం కల్పిస్తామని భరోసా

2లో



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## ముఖ్యమంత్రిని కలిసిన ఆదాయపు పన్ను ఉన్నతాధికారులు

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించిన పలు అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. రాష్ట్రంలో ఆదాయపు పన్ను నిర్వహణ, పన్ను చెల్లింపుల వ్యవస్థ, ప్రజలకు అందించే సేవలపై అధికారులు వివరాలు అందించారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలనలో పారదర్శకత, సమర్థతకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. కేంద్రరాష్ట్ర సమన్వయంతో ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆదాయపు పన్ను శాఖ అధికారులు కూడా పరిపాలనలో సమన్వయం కొనసాగించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. పన్ను చెల్లింపుదారులకు సులభతరం చేసే విధానాలను అమలు చేయడానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ భేటీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వంతో ఆదాయపు పన్ను శాఖ మధ్య సమన్వయం మరింత బలోపేతం అవుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు. భవిష్యత్‌లో కూడా ఇలాంటి పరస్పర సమావేశాలు కొనసాగుతాయని తెలిపారు.

## సైబర్ నేరాలపై కట్టడి

(మొదటి పేజీ తరువాయి)

ఈ సమస్యను పరిష్కరించేందుకు ఆర్బీఐ, బ్యాంకులు, పోలీసుల మధ్య సంయుక్త వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేయాలని సజ్జనార్ ప్రతిపాదించారు. అనుమానాస్పద లావాదేవీలను తక్షణమే గుర్తించేందుకు ఆధునిక సాంకేతికతను బ్యాంకులు ఉపయోగించాలన్నారు. ఇక ప్రజలకు కూడా ఆయన కీలక సూచనలు చేశారు. వాట్సాప్, టెలిగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో వచ్చే భారీ లాభాల వాగ్దానాలను నమ్మవద్దని హెచ్చరించారు. ఎలాంటి చట్ట అమలు సంస్థలు వీడియో కాల్ ద్వారా విచారణ చేయవని, డబ్బులు అడగవని స్పష్టం చేశారు.
బ్యాంక్ ఖాతాలను కమీషన్ కోసం అద్దెకు ఇవ్వడం చట్ట విరుద్ధమని, అలా చేసినవారే నేరాలకు బాధ్యులవుతారని తెలిపారు. సైబర్ మోసాలకు గురైన వారు వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని లేదా అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. సమయానికి స్పందిస్తే నష్టాన్ని తగ్గించవచ్చని ఆయన పేర్కొన్నారు.

## జగద్గిరిగుట్ట కోనేరుకు కొత్త జీవం

(మొదటి పేజీ తరువాయి)

కోనేరును చూడకుండానే జీవితం ముగిసిపోతుందేమో అనుకున్నానని, ఇప్పుడు పునరుద్ధరణ పనులు జరగడం దేవుని కృపగా భావిస్తున్నానని అన్నారు. జగద్గిరిగుట్ట ప్రాంతంలో అనేక దేవాలయాలు ఉన్న నేపథ్యంలో ఈ కోనేరుకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందని తెలిపారు. వర్షాకాలంలో గుట్టల నుంచి వచ్చే నీటిని కోనేరులో నిల్వ చేయడంతో పాటు, అవసరమైతే బోర్లు ద్వారా నీటిని నింపి సంరక్షిస్తామని పూజారి తెలిపారు. ఈ చర్యతో ఆలయ ప్రాంతానికి పునర్వైభవం చేకూరుతుందని భక్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## అడ్వాన్స్‌డ్ తయారీ రంగంలో పెట్టుబడులకు తెలంగాణకు ఆహ్వానం

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో పాల్గొన్న ఇటలీ రాయబారి ఆంటోనియో బార్టోలి తెలంగాణతో కలిసి పనిచేయడానికి ఆసక్తి వ్యక్తం చేశారు. పెట్టుబడులు, సాంకేతిక సహకారం పెంపుకు వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ వర్కింగ్ గ్రూప్ ద్వారా పెట్టుబడుల అవకాశాలను గుర్తించి, సంయుక్త ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. పరిశ్రమల అభివృద్ధికి ఇది కీలక అడుగుగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించడంలో ముందంజలో ఉందని మంత్రి పేర్కొన్నారు. సులభ అనుమతులు, వేగవంతమైన విధానాలు పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయని చెప్పారు. ఈ సమావేశం ద్వారా తెలంగాణ-ఇటలీ మధ్య పారిశ్రామిక భాగస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని అధికారులు భావిస్తున్నారు. భవిష్యత్‌లో పెద్ద ఎత్తున పెట్టుబడులు రావచ్చని అంచనా వేస్తున్నారు.

## ఆర్టీసీ సమ్మెపై ప్రభుత్వ స్పందన

- సమస్యల పరిష్కారానికి కమిటీ ఏర్పాటు
- కార్మికుల డిమాండ్లపై సానుకూల వైఖరి
- ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు



**హైదరాబాద్, ఏప్రిల్ 21 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ కార్మికుల సమ్మె అంశంపై కీలక ప్రకటన చేశారు. కార్మికుల డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని, అయితే నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో కొంత సమయం పట్టే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఆర్టీసీ కార్మికులు లేవనెత్తిన అన్ని సమస్యలను సమగ్రంగా పరిశీలించేందుకు నలుగురు ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు.
ఈ కమిటీకి కార్మిక సంఘాల ప్రతినిధులు తమ సమస్యలను, డిమాండ్లను వివరంగా విన్నవించాలని ఆయన సూచించారు. ప్రతి అంశాన్ని సవివరంగా అధ్యయనం చేసి నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు.
కమిటీ నివేదిక అందిన అనంతరం ఉప ముఖ్యమంత్రి, తాను కలిసి అధికారులతో చర్చించి సమస్యలకు తగిన పరిష్కార మార్గాలను కనుగొంటామని మంత్రి చెప్పారు. కార్మికుల సంక్షేమం, సంస్థ బలోపేతం రెండింటినీ సమతుల్యంగా చూడటం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి రోజు సుమారు 65 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ సేవలను వినియోగిస్తున్నారని మంత్రి వివరించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద ప్రజలు ఉపాధి, విద్య, వైద్య అవసరాల కోసం ఈ బస్సులపై ఆధారపడుతున్నారని చెప్పారు. అందువల్ల ఆర్టీసీ సేవలు నిలిచిపోకుండా చూడటం అత్యంత కీలకమని స్పష్టం చేశారు.
ఆర్టీసీ బస్సులు పేద ప్రజల జీవనాధారంగా ఉన్నాయని, వాటి సేవలు అంతరాయం కలగకుండా ఉండేందుకు ప్రభుత్వం, ఉద్యోగులు కలిసి బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. సమస్యల పరిష్కారంలో పరస్పర సహకారం ఎంతో ముఖ్యమని సూచించారు.
ఎలాంటి ఆందోళనలు, ఆలస్యం లేకుండా అధికారుల కమిటీకి తమ సమస్యలను విన్నవించాలని కార్మికులకు మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని న్యాయమైన నిర్ణయాలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ సంస్థను బలోపేతం చేస్తూ, ఉద్యోగుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యాన్ని సమన్వయంతో ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.

# ఈ నెల 27న బీఆర్ఎస్ ప్రత్యేక సమావేశం

- కేసీఆర్ అధ్యక్షతన రజతోత్సవాల ముగింపు సభ
- సంస్థాగత నిర్మాణం, సభ్యత్వాలపై కీలక చర్చలు
- పార్టీ ప్రముఖులకు ఆహ్వానం

**హైదరాబాద్, ఏప్రిల్ 21 (తెలంగాణ ముచ్చట్లు):** భారత రాష్ట్ర సమితి ఈ నెల 27న హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించనుంది. మధ్యాహ్నం 2 గంటలకు పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అధ్యక్షతన ఈ సమావేశం జరగనుంది. పార్టీ రజతోత్సవ సంబురాల ముగింపు సందర్భంగా నిర్వహిస్తున్న ఈ సమావేశానికి ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడింది. ఈ సందర్భంగా పార్టీ భవిష్యత్ కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశముందని సమాచారం.
ఈ సమావేశంలో ముఖ్యంగా పార్టీ సంస్థాగత నిర్మాణం, సభ్యత్వాల పునరుద్ధరణ, బలోపేతంపై విస్తృతంగా చర్చించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా వ్యూహాలు రూపొందించే అవకాశం ఉంది. రాజకీయ పరిస్థితులు, భవిష్యత్ ఎన్నికల వ్యూహాలపై కూడా నాయకత్వం కీలక మార్గదర్శకాలు ఇవ్వనుందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. పార్టీ కార్యకర్తలను చైతన్యపరిచే కార్యక్రమాలకు కూడా రూపకల్పన చేసే అవకాశముంది.
ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, పార్లమెంట్ సభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసనసభ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు ఆహ్వానించబడ్డారు. విస్తృత స్థాయిలో నాయకులు పాల్గొననున్నట్లు తెలుస్తోంది.
రాబోయే రాజకీయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ సమావేశం కీలకంగా మారనుందని విశ్లేషకులు భావిస్తున్నారు. పార్టీ భవిష్యత్ దిశను నిర్దేశించే నిర్ణయాలు వెలువడే అవకాశముందని అంచనా వేస్తున్నారు.



# తెలంగాణలో ఆర్టీసీ సమ్మె సైరన్



**హైదరాబాద్, ఏప్రిల్ 21 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీ ఆర్టీసీ) కార్మికులు మరోసారి సమ్మె బాట పట్టారు. ఏళ్లుగా పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్న పలు డిమాండ్ల సాధన కోసం నేడు అర్ధరాత్రి నుంచే సమ్మెకు వెళ్తున్నట్లు ఆర్టీసీ జేఏసీ నేతలు అధికారికంగా ప్రకటించారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రజా రవాణా వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడే అవకాశం కనిపిస్తోంది. ప్రధానంగా ఆర్టీసీని ప్రభుత్వంలో పూర్తిస్థాయిలో విలీనం చేయడం, గతంలో రద్దయిన కార్మిక సంఘాలను పునరుద్ధరించడం, రెండో వేతన సవరణ (పీఆర్సీ) అమలు విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను తక్షణమే చెల్లించాలనే ప్రధాన డిమాండ్లతో కార్మికులు ఈ నిరసనకు దిగుతున్నారు. ఈసారి ఈదురు వెంకన్న, థామస్ రెడ్డి నేతృత్వంలోని జేఏసీతో పాటు గతంలో భిన్నధృవాలుగా ఉన్న అశ్వత్థామరెడ్డి వర్గం కూడా మద్దతు తెలపడం గమనార్హం.
ఈ సమ్మె ప్రభావం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 60 లక్షల మంది ప్రయాణికులపై పడనుంది. ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతిరోజూ ఉచితంగా ప్రయాణించే 35 లక్షల మంది మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉంది. జాతీయ మజ్దూర్ యూనియన్ (టీజేఎంయూ) సహా అన్ని ప్రధాన సంఘాలు ఈ పోరాటానికి సంఘీభావం తెలపడంతో, రాష్ట్రంలోని దాదాపు 10 వేల బస్సులు డిపోలకే పరిమితం కానున్నాయి. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డితో జేఏసీ నేతలు జరిపిన చర్చలు ఫలించకపోవడంతోనే ఈ తీవ్ర నిర్ణయం తీసుకున్నట్లు హనుమంతు ముదిరాజ్ స్పష్టం చేశారు. బుధవారం మొదటి షిఫ్ట్ నుంచే కార్మికులు విధులను బహిష్కరించాలని పిలుపునిచ్చారు. సమ్మె సైరన్ మోగడంతో అప్రమత్తమైన ప్రభుత్వం నివారణా చర్యలు చేపట్టింది. సోమవారం కాళేశ్వరం పర్యటనలో ఉన్న రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ అంశంపై స్పందిస్తూ, ఆర్టీసీ సామాన్య ప్రజల జీవనరేఖ అని, దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగిపోనివ్వబోమని పునరుద్ఘాటించారు. కార్మికుల మెజారిటీ డిమాండ్ల పట్ల ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉందన్న ఆయన, విలీనం యూనియన్ల పునరుద్ధరణ వంటి సున్నితమైన అంశాలపై ఉన్నత స్థాయి నిర్ణయం తీసుకోవాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. సమ్మెను నివారించేందుకు మంత్రి ఇప్పటికే ఆర్టీసీ ఎండీ ఇతర ఉన్నతాధికారులతో తన నివాసంలో అత్యవసర సమావేశాన్ని నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు.
మరోవైపు, ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా సమ్మెను నీరుగార్చాలని చూస్తే సహించేది లేదని కార్మిక నేతలు హెచ్చరిస్తున్నారు. ప్రైవేట్ సిబ్బందిని రంగంలోకి దించి బస్సులు నడపాలని చూస్తే గతంలో జరిగిన 'సకల జనుల సమ్మె' తరహాలోనే అడ్డుకుంటామని జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న హెచ్చరించారు. ఈ ఉద్రిక్త పరిస్థితుల నడుమ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తన చెన్నై పర్యటన ముగించుకుని వచ్చిన వెంటనే జేఏసీ నేతలతో మరో దఫా చర్చలు జరిపే అవకాశం ఉంది. ప్రభుత్వ వర్గాల నుంచి వచ్చే చివరి నిమిషం ప్రతిపాదనల కోసం కార్మికులు వేచి చూస్తున్నప్పటికీ, ప్రస్తుతానికి సమ్మెకు సిద్ధమనే సంకేతాలే బలంగా కనిపిస్తున్నాయి.
రాష్ట్రవ్యాప్తంగా సామాన్య ప్రజలు ఈ పరిణామాల పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి నగరాలకు వచ్చే విద్యార్థులు, ఉద్యోగులు చిరు వ్యాపారులకు ఆర్టీసీ బస్సులే ప్రధాన ఆధారం. ప్రభుత్వం, జేఏసీ నేతల మధ్య ప్రతిష్టంభన కొనసాగితే రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించి ఆర్థిక కార్యకలాపాలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని, కార్మికులకు ఆమోదయోగ్యమైన హామీలు ఇచ్చి సమ్మెను విరమింపజేయాలని ప్రజలు కోరుతున్నారు. బుధవారం ఉదయం బస్సులు రోడ్డెక్కుతాయా లేదా అన్నది ప్రస్తుతం ప్రభుత్వ తదుపరి చర్యలపైనే ఆధారపడి ఉంది.

# రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు



**నల్లగొండ, ఏప్రిల్ 21 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నల్లగొండలోని ఇందిరా భవన్‌లో జిల్లా అధికారులతో కలిసి యాసంగి వరి ధాన్యం సేకరణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, అదనపు కలెక్టర్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లు జరపాలని మంత్రి స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి ఆలస్యం లేకుండా పనులు జరగాలని అధికారులకు కఠిన ఆదేశాలు జారీ చేశారు.
అన్ని కొనుగోలు కేంద్రాలకు అవసరమైనన్ని లారీలను వెంటనే ఏర్పాటు చేయాలని, సేకరించిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని మంత్రి సూచించారు. రవాణా విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, రైతులు ఎదురుచూడకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ధాన్యం ఎక్కువగా వచ్చే గ్రామాల్లో అదనపు లారీలను అందుబాటులో ఉంచాలని, రైతులు రోడ్లపై ధాన్యం పోయకుండా అవసరమైతే ఫంక్షన్ హాళ్ల వద్ద కూడా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని మంత్రి తెలిపారు. రైతులకు సౌకర్యవంతమైన విధంగా ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు.
ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో నిర్ణీత సమయంలోనే డబ్బులు జమ అయ్యేలా చూడాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. చెల్లింపుల్లో ఎలాంటి ఆలస్యం జరగకుండా కఠినంగా పర్యవేక్షణ చేయాలని అన్నారు. నల్లగొండ నియోజకవర్గంలో సుమారు 2.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేసి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

# వడ్డెరుల అభివృద్ధికి ప్రభుత్వం అండ

- మంత్రి కోమటిరెడ్డి హామీ
- నల్లగొండలో అఖిలభారత వడ్డెర సంఘం సమావేశం
- పెండింగ్ బిల్లుల విడుదలపై వివరాలు
- నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం కల్పిస్తామని భరోసా



**నల్లగొండ, ఏప్రిల్ 21 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నల్లగొండలోని ఎమ్మెన్నార్ గార్డెన్స్‌లో జరిగిన అఖిలభారత వడ్డెర సంక్షేమ సంఘం సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వడ్డెర సంఘం సభ్యులతో మమేకమై వారి సమస్యలు, అభ్యర్థనలు తెలుసుకున్నారు. ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ వడ్డెర సమాజం అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. కష్టజీవులైన వడ్డెర సోదరుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని స్పష్టం చేశారు.
ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వడ్డెరులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను విడుదల చేసినట్లు మంత్రి వెల్లడించారు. గతంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. వచ్చే నెలలో భర్తీ చేయనున్న నామినేటెడ్ పదవుల్లో వడ్డెరులకు తగిన ప్రాధాన్యం కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. వడ్డెరుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించే బాధ్యత తనదేనని మంత్రి తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. అలాగే నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న వడ్డెర సంఘం భవనాన్ని త్వరితగతిన పూర్తి చేస్తామని మంత్రి వెల్లడించారు. వడ్డెర సమాజ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



## బాల్యమిత్రుడు మన్నెంకొండ కుటుంబానికి స్నేహితుల ఆర్థిక సహాయం

**పెద్దమందడి,ఏప్రిల్21(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మణిగిల్ల గ్రామానికి చెందిన మన్నెంకొండ అనే వ్యక్తి అనారోగ్య సమస్యల కారణంగా ఇటీవల మరణించడం స్థానికంగా విషాదాన్ని నింపింది.2006-2007 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన బాల్యమిత్రుడు ఇకలేకపోవడం అతని స్నేహితులను తీవ్రంగా కలిచివేసింది .ఈ కష్ట సమయంలో అతని కుటుంబానికి అండగా నిలవాలని సంకల్పించిన చిన్ననాటి స్నేహితులు అందరూ కలిసి మానవత్వాన్ని చాటుకున్నారు. వారు తమ వంతుగా రూ. 42,000/ఆర్థిక సహాయాన్ని సమీకరించి, మృతుడి భార్య మరియు పిల్లలకు అందజేశారు. స్నేహితులు మాట్లాడుతూ.. మన స్నేహితుడు ఇక మన మధ్య లేకపోయినా, అతని జ్ఞాపకాలు ఎప్పటికీ మనతోనే ఉంటాయి. అతని కుటుంబానికి ఈ కష్టకాలంలో తోడుగా నిలవడం మన బాధ్యతగా భావించాం అని తెలిపారు .ఈ సందర్భంగా గ్రామస్థులు స్నేహితుల ఈ సేవా భావాన్ని అభినందిస్తూ.. స్నేహబంధం గొప్పతనాన్ని కొనియాడారు.మన్నెంకొండ ఆత్మకు శాంతి చేకూరాలని, అతని కుటుంబానికి ధైర్యం కలగాలని అందరూ ప్రార్థించారు.




## వెల్టూర్ పాఠశాలకు పూర్వ విద్యార్థులు కుర్చీల విరాళం

**పెద్దమందడి,ఏప్రిల్21(తెలంగాణ ముచ్చట్లు):** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్టూర్ లో 1997-98 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ మిత్రబృందం పాఠశాల ఆవరణలో సమావేశమై పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారంగా 6 ఎస్ టైప్ కుర్చీలను బహుకరించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న శివకుమార్, డి నాగరాజు, చంద్రశేఖర్ రెడ్డి మరియు సంజీవ్ టీచర్ మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి ఎల్లప్పుడూ మా సహకారం కొనసాగుతుంది అని తెలిపారు. 1997 98 పదవ తరగతి పూర్వ విద్యార్థుల తరపున ఈ సహాయం అందజేసినట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం తరపున హెడ్మాస్టర్ బాణం విష్ణు వారి సేవా భావాన్ని అభినందిస్తూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమం పాఠశాల అభివృద్ధికి తోడ్పడటంతో పాటు పాఠశాలతో ఉన్న అనుబంధాన్ని మరింత బలపరిచిందని ఆయన పేర్కొన్నారు.



## మేడే వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలి: సిఐటియు పిలుపు

**హుజురాబాద్ టౌన్ ఏప్రిల్ 21 (తెలంగాణ ముచ్చట్లు):** జిల్లావ్యాప్తంగా నిర్వహించే మేడే వారోత్సవాలను ఏప్రిల్ 23 నుంచి మే 1 వరకు విజయవంతంగా నిర్వహించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి గిట్ల ముకుంద రెడ్డి కార్మికులను కోరారు.
హుజురాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చికాగో అమరవీరుల స్ఫూర్తితో ఎర్రజెండా ఎగురవేసి కార్మిక ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. ఐక్య పోరాటాల ద్వారానే కార్మికుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.
కార్మికుల హక్కులను రక్షించే విధానాలను ప్రభుత్వం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మేడే వారోత్సవాల్లో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని తమ ఐక్యతను ప్రదర్శించాలని కోరారు.

# గంగారం సెక్టార్‌లో డీ.డబ్ల్యూ.ఓ ఆకస్మిక పర్యటన

- అంగన్వాడీల పనితీరుపై ప్రశంసలు.
- చిన్నారులతో ముచ్చటించిన విజేత.





**సత్తుపల్లి, ఏప్రిల్ 21(తెలంగాణ ముచ్చట్లు):** మండలంలోని గంగారం గ్రామం సెక్టార్‌లో అంగన్వాడీ కేంద్రాలను జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి (డీడబ్ల్యూఓ) విజేత మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. కేంద్రాలకు వెళ్లిన ఆమె చిన్నారులతో కూర్చొని మాట్లాడారు. “గుడ్లు సమయానికి ఇస్తున్నారా? ఆటలు ఆడిస్తున్నారా?” అని అడగగా, పిల్లలు ఆనందంగా “రోజూ ఇస్తున్నారు, ఆటలు కూడా ఆడిస్తున్నారు” అని చెప్పడంతో ఆమె సంతోషం వ్యక్తం చేశారు. చిన్నారుల బరువును తూకం వేసి, వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. అలాగే లబ్ధిదారులకు అందిస్తున్న పౌష్టికాహారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ టీచర్లు, ఆయాలు ఎలాంటి అక్రమ చెల్లింపులు చేస్తున్నారా అని ప్రశ్నించగా, అలాంటివి ఏవీ లేవని సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా విజేత మాట్లాడుతూ, ఎక్కడైనా విధుల్లో నిర్లక్ష్యం ఉంటే కఠిన చర్యలు తప్పవు అని హెచ్చరించారు. తనిఖీల్లో ఎలాంటి లోపాలు కనిపించలేదని, కేంద్రాల పనితీరు బాగుందని తెలిపారు.

# సిర్సపల్లి వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌పై ప్రిన్సిపల్ సెక్రటరీతో వొడితల ప్రణవ్ భేటీ



**హుజురాబాద్ టౌన్ ఏప్రిల్ 21 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ నియోజకవర్గ పరిధిలోని సిర్సపల్లి ప్రాంతంలో ప్రతిపాదిత వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ అంశంపై కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ హైదరాబాద్‌లోని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీదేవిని కలిశారు.
ఈ సందర్భంగా ప్లాంట్‌ను వేరే ప్రాంతానికి తరలించే సాధ్యాసాధ్యాలపై కూలంకషంగా చర్చించారు. ప్లాంట్‌ను స్థానాంతరం చేయాలని కోరుతూ వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ అంశంపై ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీదేవి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.
ప్లాంట్ హుజురాబాద్ మున్సిపల్ పరిధిలోని నివాస ప్రాంతాలకు సమీపంలో ఉండటం వల్ల ప్రజలకు కలిగే అనర్థాలను ప్రణవ్ వివరించారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.
ఈ విషయమై త్వరలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలసి సమస్యను వివరించనున్నట్లు వొడితల ప్రణవ్ తెలిపారు.

# హుజురాబాద్‌లో వికలాంగుల సంక్షేమానికి తోడ్పాటు

- ట్రై మోటరైజ్డ్ స్కూటీలు, ఎలక్ట్రిక్ ఆటోలు పంపిణీ



**హుజురాబాద్ టౌన్ ఏప్రిల్ 21 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ పట్టణంలోని సిటీ సెంట్రల్ హాల్‌లో రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో వికలాంగుల లబ్ధిదారులకు ట్రై మోటరైజ్డ్ స్కూటీలు మరియు ఎలక్ట్రికల్ ఆటోలు పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వికలాంగుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో 8000 ఉపకరణాలను అందజేస్తున్నామని చెప్పారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం 1500 స్కూటీలను మాత్రమే పంపిణీ చేయగా, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఒకే సంవత్సరంలో 2000 ట్రై మోటరైజ్డ్ స్కూటీలను అందజేసిందని పేర్కొన్నారు.
ఈ ఉపకరణాల వల్ల వికలాంగుల్లో ఆత్మవిశ్వాసం పెరగడంతో పాటు, స్వయం ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని అన్నారు. వాహనాలను అందుకున్న లబ్ధిదారులు రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, వార్డ్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# సేవలకు గుర్తింపు – ఇద్దరు ఏఎస్ఐలకు ఉత్తమ సేవ పథకం

- భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ చేతుల మీదుగా పురస్కారాల ప్రదానం

**సత్తుపల్లి, ఏప్రిల్ 21(తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న జి. ప్రతాప్ రెడ్డి, టి. ప్రసాదరావు ఏఎస్ఐలకు ప్రభుత్వం ఉత్తమ సేవ పథకాన్ని మంజూరు చేసింది. గతంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వారు అందించిన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు చేతుల మీదుగా మంగళవారం ఈ పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా పురస్కారం అందుకున్న ఏఎస్ఐలను సత్తుపల్లి పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ టి. శ్రీహరి, ఎస్ఐలు ఎస్. వీరప్రసాద్, పి. ప్రదీప్, జి. అశోక్ కుమార్, ఎస్. నాగరాజు ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్ ఎన్. శ్రీనివాసరావు తదితర సిబ్బంది అభినందించారు.






# వనపర్తిలో శ్రీ శుభం గ్రూపు కార్యాలయం ప్రారంభం

**వనపర్తి, ఏప్రిల్ 21(తెలంగాణ ముచ్చట్లు):** జిల్లా కేంద్రంలో శ్రీ శుభం గ్రూపు కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించారు.సంస్థ ఛైర్మన్ అక్కల మధుసూదన్ గౌడ్, సంస్థ ఎండి భరత్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థిరాస్తి వ్యాపార రంగంలో వేలాది మందికి ఉపాధి కల్పించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు.మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటు ధరల్లో తమ ప్రాజెక్టులలో స్థలాలు అందిస్తామని పేర్కొన్నారు.అన్ని ప్రభుత్వ అనుమతులతో జాతీయ రహదారి 44 వద్ద అడ్డాకుల్ సమీపంలో 14 ఎకరాల్లో, అలాగే వనపర్తి పట్టణంలోని 6వ వార్డు పరిధిలో 10 ఎకరాల్లో అభివృద్ధి చేసిన నివాస స్థలాలు అందుబాటులో ఉన్నాయని ఛైర్మన్ మధుసూదన్ గౌడ్ వెల్లడించారు.




# నేషనల్ హ్యూమన్ రైట్స్ జస్టిస్ కౌన్సిల్ వనపర్తి జిల్లా అధ్యక్షుడిగా డి. రవి ప్రసాద్ నియామకం

**వనపర్తి,ఏప్రిల్ 21(తెలంగాణ ముచ్చట్లు):** నేషనల్ హ్యూమన్ రైట్స్ జస్టిస్ కౌన్సిల్ వనపర్తి జిల్లా అధ్యక్షుడిగా డి. రవి ప్రసాద్‌ను నియమించారు.సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మహమ్మద్ అబ్దుల్ రెహమాన్ ఈ బాధ్యతలను ఆయనకు అప్పగించారు.ఈ సందర్భంగా డి. రవి ప్రసాద్ మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందన్నారు. సమాజ అభివృద్ధి ఒక్కరితో సాధ్యం కాదని, ప్రతి పౌరుడు ప్రశ్నించే స్వభావాన్ని అలవరచుకోవాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో అవినీతి, స్వార్థ రాజకీయాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలను చైతన్యవంతం చేయడం ముఖ్య లక్ష్యమని తెలిపారు. స్వచ్ఛంద సంస్థల పాత్ర సమాజ అభివృద్ధిలో కీలకమని పేర్కొంటూ, ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించే దిశగా చర్యలు చేపడతామని వెల్లడించారు. త్వరలోనే మండల, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసి సంస్థను మరింత బలోపేతం చేస్తామని చెప్పారు.ఈ బాధ్యతలను అప్పగించినందుకు వ్యవస్థాపక అధ్యక్షులు మహమ్మద్ అబ్దుల్ రెహమాన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లేపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## ఆహార పట్టిక ప్రకారం భోజనం తప్పనిసరి

- **పామిరెడ్డిపల్లిలో పాఠశాలపై సర్పంచ్ ఆకస్మిక తనిఖీ**

**పెద్దమందడి,ఏప్రిల్21(తెలంగాణ ముచ్చట్లు)**

వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం గ్రామ సర్పంచ్ మధిర మంజుల శ్రీశైలం ఆకస్మికంగా ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా తరగతి గదులను పరిశీలించి, విద్యార్థుల హాజరు మరియు బోధన పరిస్థితులపై ఆరా తీశారు.తదనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన సర్పంచ్, విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం వడ్డించాలని వంట సిబ్బందికి స్పష్టంగా సూచించారు.భోజనంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని హెచ్చరించారు.అదేవిధంగా పాఠశాల ఆవరణ పరిశుభ్రతపై దృష్టి సారిస్తూ, పరిసరాలు ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సీఆర్పీ తిరుపతిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్, స్థానిక కాంగ్రెస్ నాయకులు మధిర శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్‌పై అర్వింద్ ఘాటు వ్యాఖ్యలు

- **రైతుల సమస్యలపై ఆందోళన**
- **బీఆర్ఎస్ భవిష్యత్తుపై విమర్శలు**
- **కుటుంబ నేతలపైనే ఆరోపణలు**
- **పసుపు రైతులకు మద్దతు ధరపై హామీ**



**నిజామాబాద్, ఏప్రిల్ 21 (తెలంగాణ ముచ్చట్లు):** బీజేపీ నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ బీఆర్ఎస్ పార్టీపై, ఆ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ తన కళ్లతోనే బీఆర్ఎస్ అంతమవడం చూడాలని తాము కోరుకుంటున్నామని, అది త్వరలోనే జరుగుతుందని అన్నారు. కేసీఆర్‌ను ఇతరుల కంటే ఎక్కువగా ఆయన కుటుంబ సభ్యులే ఇబ్బందులకు గురి చేస్తున్నారని అర్వింద్ ఆరోపించారు. ముఖ్యంగా కేటీఆర్, కవిత కల్వకుంట్ల, హరీశ్ రావుల పేర్లు ప్రస్తావిస్తూ విమర్శలు గుప్పించారు. కేటీఆర్, కవితలను బయటకు పంపిస్తే రాష్ట్రానికి మేలు జరుగుతుందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై కూడా అర్వింద్ తన అభిప్రాయాలు వెల్లడించారు. బీఆర్ఎస్ పాలన తర్వాత కూడా పరిస్థితులు మెరుగుపడలేదని, ప్రజలు ఇంకా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.

రైతుల సమస్యలపై మాట్లాడిన అర్వింద్, కాంగ్రెస్ పాలనలో రైతులు తీవ్ర కష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నాయని, రైతుల పంటలకు సరైన ధర లభించడం లేదని విమర్శించారు. పసుపు రైతులకు సంబంధించి ఆయన కీలక హామీ ఇచ్చారు. తాను రాజకీయాల నుంచి తప్పుకునే లోపు పసుపు పంటకు క్వింటాల్‌కు రూ.30 వేల మద్దతు ధర వచ్చేలా కృషి చేస్తానని చెప్పారు. రైతుల ప్రయోజనాలే తనకు ముఖ్యమని స్పష్టం చేశారు. రైతుల గోడును వినే పరిస్థితి ప్రస్తుతం కనిపించడం లేదని అర్వింద్ వ్యాఖ్యానించారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ, తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

## తమిళనాడులో ప్రచార యాత్రలో భట్టి విక్రమార్క

- **ఐక్యతకు ప్రజల మద్దతు ఉందని వ్యాఖ్యలు**
- **షోలింగూర్ నియోజకవర్గంలో గ్రామాల పర్యటన**
- **అభివృద్ధి ప్రయాణం కొనసాగించాలన్న ప్రజల సంకల్పం**
- **ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపు**

**షోలింగూర్, ఏప్రిల్ 21 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు తమిళనాడులో ఎన్నికల ప్రచారంలో భాగంగా రాణిపేట్ జిల్లాలోని షోలింగూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా ప్రజలను కలుసుకుని వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రజలతో నేరుగా మమేకమై మాట్లాడిన భట్టి విక్రమార్క, అభివృద్ధి ప్రయాణాన్ని కొనసాగించాలనే బలమైన సంకల్పం ప్రజల్లో కనిపించిందని తెలిపారు. ముఖ్యమంత్రి ఎం కె స్టాలిన్ నాయకత్వంలో కొనసాగుతున్న అభివృద్ధికి ప్రజలు మద్దతు ఇస్తున్నారని పేర్కొన్నారు. షోలింగూర్ ప్రాంతంలోని పలు గ్రామాల్లో ప్రజలను కలిసిన సందర్భంగా, సామరస్యానికి ప్రజలు ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన అన్నారు.

విభజన కంటే ఐక్యతను ఎంచుకుంటున్నారని, ఇది ప్రజాస్వామ్యానికి మంచి సంకేతమని అభిప్రాయపడ్డారు.

భవిష్యత్తులో సమగ్ర అభివృద్ధి కోసం ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ప్రజల సంక్షేమం, సమాన అవకాశాల కోసం కృషి చేసే నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఇండియా కూటమికి మద్దతు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావాలంటే ఐక్యంగా పనిచేయాలని సూచించారు. ప్రజలు మరింత అభివృద్ధి, సమగ్రత వైపు అడుగులు వేయాలని ఆకాంక్షిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో ఐక్యత, అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ నిర్ణయం తీసుకోవాలని ఓటర్లకు సూచించారు.







## అంగన్వాడి టీచర్లకు ఉచిత స్మార్ట్‌ఫోన్లు

- **మెరుగైన సేవలందించడమే లక్ష్యం**
- **ఎమ్మెల్యే జారె ఆదినారాయణ**

**అశ్వారావుపేట, ఏప్రిల్ 21(తెలంగాణ ముచ్చట్లు):** అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలోని రైతు వేదికలో అంగన్వాడి టీచర్లకు ప్రభుత్వం అందించిన ఉచిత స్మార్ట్‌ఫోన్లను ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడి సేవల ద్వారా అందుతున్న పోషకాహార ప్రయోజనాలను వివరించే వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం అంగన్వాడి కేంద్రాల్లో చదువుతున్న చిన్నారులకు దుస్తులు, పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు, మండల అధ్యక్షులు తుమ్మా రాంబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి శశికళ, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, ఐసీడీఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డా. గుగ్గిళ్ళ దివ్యమూర్తికి ఘనంగా సన్మానం

**ఖమ్మం బ్యూరో, ఏప్రిల్ 21(తెలంగాణ ముచ్చట్లు )**

ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరు గ్రామానికి చెందిన అపరమేధావి డాక్టర్ గుగ్గిళ్ళ దివ్యమూర్తికి ఖమ్మం పట్టణంలోని అల్లీపురం క్రాస్ రోడ్ లో గల సిపిఐ కార్యాలయంలో ఖమ్మం జిల్లా సిపిఐ నాయకులచే శాలువాతో ఘనంగా సన్మానం జరిగింది. గుగ్గిళ్ళ దివ్యమూర్తి యొక్క ప్రతిభను గుర్తించి, సమాజానికి అతను చేస్తున్న సేవలు గుర్తించి ఈ సన్మానం చేసినట్లు సిపిఐ నాయకులు తెలియజేశారు. ఈ సందర్భంగా గుగ్గిళ్ళ దివ్యమూర్తి మాట్లాడుతూ తనకు ఈ సన్మానం జరగడం సంతోషంగా ఉందని ఇప్పటివరకు 139 వేదికల మీద సన్మానం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పగడాల మల్లేష్, ప్రముఖ సామాజికవేత్త బూర సైదారావు గౌడ్, కొండా లక్ష్మీనారాయణ గౌడ్, వరద నరసింహారావు, మలకొండయ్య, పోతురాజు వెంకన్న, జొన్నలగడ్డ వెంకన్న, లక్క వీరయ్య, ఇతర సిపిఐ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## జే.కే.యం సోలార్ ఎనర్జీ కార్యాలయము ప్రారంభించిన డా.తుమ్మల యుగంధర్

**ఖమ్మం బ్యూరో , ఏప్రిల్ 21(తెలంగాణ ముచ్చట్లు )**

ఖమ్మం బైపాస్ రోడ్ లోని టీ.వీ.ఎస్ షోరూం కు ఎదురుగా ఉన్న బిల్డింగ్ లో, సోమవారం జే.కే.యం సోలార్ ఎనర్జీ కార్యాలయము మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు డాక్టర్ తుమ్మల యుగంధర్ ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ,

ఖమ్మం ప్రజలకు సోలార్ విద్యుత్ అనేది ఒక అద్భుత అవకాశంగా భావించాలి. ఈ జే.కే.యం సోలార్ ఎనర్జీ స్థాపించిన, మెర్సీ ఏంజెల్ జె.కె మహేష్‌కు అభినందనలు తెలియజేస్తూ, ఈ సోలార్ పథకం ద్వారా మీరు 78,000 సబ్సిడీ ఉంది. కరెంట్ బిల్లు భారాన్ని తగ్గించి, ఆదాయం పొందే విధంగా, మిగులు విద్యుత్ ను ప్రభుత్వ సంస్థలకు అమ్ముకొని ఆదాయం పొందవచ్చు అని, ఈ సందర్భంగా తెలియజేసారు.

జే.కే.యం సోలార్ ఎనర్జీ అధినేత మెర్సీ ఏంజెల్ జె.కె మహేష్ మాట్లాడుతూ, విద్యుత్ బిల్లు భారం, కాలుష్యం తగ్గించేలా, పీ.ఎం సూర్యఘర్ పథకంతో 3 కిలో వాట్ 10 కిలో వాట్ సోలార్ కి, రూ.78,000/ వరకు సబ్సిడి పొంది, కరెంటు బిల్లు భారాన్ని తగ్గించి, ఆదాఆదాయం పొందే విధంగా మీ ఇంటిపై సోలర్ ఏర్పాటు చేసుకొనే వారికి సబ్సిడితోపాటు మిగులు విద్యుత్ ను ప్రభుత్వ సంస్థలకు అమ్ముకొని, ఆదాయం పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు. అనంతరం సోలార్ ఉపయోగాలు వివరిస్తూ, ప్రతి నెల 360750 యూనిట్స్ జనరేట్ కి అవకాశం. ప్రతి నెల మీరు చెల్లించే విద్యుత్ బిల్లుకు బదులుగా 510సం॥లు ఈజీ ఈ.ఎం.ఐ చెల్లించకుంటే 2025 సం॥ల వరకు ఉచితంగా విద్యుత్ వాడుతూ, మిగిలిన విద్యుత్ను ప్రభుత్వానికి ఇచ్చి ఆదాయం పొందవచ్చు.






ఈ సోలార్ యూనిట్ కు 25 సం॥ల వారంటీ మరియు 5 సం॥ల ఉచిత సర్వీస్ ఉంటుంది. మీవద్ద 0 డౌన్ పేమెంట్, 0 సర్వీస్ చార్జి, 0 సైట్ విసిట్ చార్జి 0 అప్లికేషన్ చార్జి మరియు మీ వద్ద నుండి ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా ఈజీ ఈ.ఎం.ఐ తో ఇన్స్టాలేషన్ చేస్తాము. ఉచిత సర్వీస్ అందిస్తాము. విద్యుత్ ఖర్చులు తగ్గించి గ్రీన్ పవర్ సాదించేందుకు ఇది ఒక మార్గం. మొదటి 100 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి అదనంగా రు.10,000/ వరకు డిస్కౌంట్ ఇవ్వబడును. మీ గృహ మరియు వ్యవసాయ అవసరాలకు సోలార్ ఫెన్సింగ్ లైట్, పొలాల బోర్ మరియు పంపు సెట్ లకు, పరిశ్రమలకు సోలార్ ఫిట్టింగ్ చేయబడును అని తెలుపుతూ, ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి పేరు పేరునా ధన్యవాదాలు తెలియజేసారు.

ఈ కార్యక్రమంలో ఏ.ఎం.సీ చైర్మన్ యర్లగడ్డ హనుమంతరావు, డివిజన్ కార్పరేటర్ రాపర్తి శరత్, అశ్రీఫ్, విగ్నేష్ , యుగంధర్, బద్రుల్ల, నరాల నరేష్, మూర్తి, కిరణ్, బాచి, ఉదయ్, క్రాంతి, ఓం ప్రకాష్, సుమన్, సందీప్, దినాకర్, అశోక్, ముజీబ్, స్వామి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.250 కోట్లు దోచేసిన ముఠా

- **రైతులను మోసం చేసిన భారీ కుంభకోణం..**
- **మంచి వడ్డీ పేరుతో రైతులను వలలోకి దింపిన నిందితులు**
- **25 గ్రామాలకు చెందిన 3 వేల మందికి పైగా బాధితులు**
- **న్యాయం కోరుతూ ఆందోళనకు దిగిన రైతులు**

**నాగర్ కర్నూల్, ఏప్రిల్ 21 (తెలంగాణ ముచ్చట్లు):** పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద భూములు కోల్పోయిన రైతులను లక్ష్యంగా చేసుకుని జరిగిన భారీ మోసం వెలుగులోకి వచ్చింది. మంచి వడ్డీ ఇస్తామని నమ్మబలికి సుమారు రూ.250 కోట్లను కాజేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది.

బాధితుల వివరాల ప్రకారం, ఓం శ్రీ సాయిరాం ఫైనాన్స్ పేరిట ఇట్యాల సాయిబాబా ప్రధాన నిందితుడిగా ఈ మోసానికి పాల్పడ్డాడు. అతనితో పాటు పలువురు కలిసి రైతులను లక్ష్యంగా చేసుకుని ప్రణాళికాబద్ధంగా మోసం చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తక్కువ ధరలో భూములు ఇప్పిస్తామని, పెట్టుబడులకు అధిక వడ్డీ ఇస్తామని చెప్పి గ్రామాల్లో ప్రచారం చేశారు. నాగర్ కర్నూల్, కొల్హాపూర్ ప్రాంతాలకు చెందిన సుమారు 25 గ్రామాల్లో ఈ ముఠా తిరుగుతూ రైతులను నమ్మించింది. ప్రాజెక్టు కారణంగా భూములు కోల్పోయిన రైతులు తమకు వచ్చిన నష్టపరిహారం డబ్బును పెట్టుబడిగా పెట్టారు. ఈ క్రమంలో దాదాపు 3 వేల మంది రైతుల నుంచి రూ.250 కోట్ల వరకు సొమ్మును సేకరించినట్లు తెలుస్తోంది. కొంతకాలం తర్వాత నిందితుల నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో రైతులు మోసపోయామని గ్రహించారు. న్యాయం కోసం హైకోర్టును ఆశ్రయించగా, నిందితుల ఆస్తులను జప్తు చేసినట్లు సమాచారం. అయితే తమ డబ్బులు తిరిగి రావాలని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నిందితుల్లో ఒకరైన ధనుంజయ్ నివాసం ముందు సుమారు 300 మంది బాధితులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. తమ కష్టార్జిత డబ్బులను వెంటనే తిరిగి ఇవ్వాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

బాధితులకు మద్దతుగా స్థానిక నాయకులు కూడా స్పందించారు. రైతులకు చట్టపరమైన రక్షణ ఉన్నప్పటికీ, ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమని పేర్కొన్నారు. బాధితులకు పూర్తి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.


ఈ ఘటన రైతుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ భూములు కోల్పోయి, భవిష్యత్తుకు ఆధారంగా భావించిన డబ్బును కోల్పోవడం వల్ల ఆర్థికంగా కష్టాల్లో పడ్డామని తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టగా, నిందితులను అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఇలాంటి మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.



## ఢిల్లీ పర్యటనపై హరీశ్ రావు వివరణ

- సీఎం రేవంత్‌పై విమర్శలు
- కేసీఆర్ ఆదేశాలతోనే ఢిల్లీకి వెళ్లినట్లు స్పష్టం
- కాళేశ్వరం, ఓటుకు నోటు కేసులపై న్యాయవాదులతో చర్చ
- సీఎంవో లీకులపై ఆరోపణలు

**హైదరాబాద్, ఏప్రిల్ 21 (తెలంగాణ ముచ్చట్లు):** బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు తన ఢిల్లీ పర్యటనపై వివరణ ఇచ్చారు. తమ పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకే తాను, వినోద్ కుమార్ తదితరులు ఢిల్లీకి వెళ్లినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వేస్తున్న అక్రమ కేసులను ఎదుర్కోవడానికే ఈ పర్యటన జరిగిందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన కేసులపై ఢిల్లీలో న్యాయవాదులతో చర్చలు జరిపినట్లు హరీశ్ రావు వెల్లడించారు. న్యాయపరమైన అంశాలను సమగ్రంగా అధ్యయనం చేసి తదుపరి చర్యలు తీసుకునే దిశగా ముందుకు సాగుతున్నామని తెలిపారు.



అయితే తన ఢిల్లీ పర్యటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎంవో నుంచి లీకులు ఇచ్చి, మీడియాలో అర్థం లేని వార్తలు ప్రచారం చేయించారని ఆరోపించారు. విషయం ఉన్నవారు ఇలాంటి చర్యలకు పాల్పడరని, విషయం లేనివారే ఇలా చేస్తారని విమర్శించారు. రేపు సుప్రీంకోర్టులో ఓటుకు నోటు కేసు విచారణకు రానుందని, ఆ కేసుపై కూడా న్యాయవాదులతో చర్చించినట్లు తెలిపారు. ఈ కేసులో నాటి ముఖ్యమంత్రి, హోంమంత్రి కూడా ఇంప్లీడ్ అయ్యారని పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం తరపున సరైన న్యాయవాదిని నియమించలేదని విమర్శించారు. నిందితుల తరపున ప్రముఖ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తున్నారని, రేపటి విచారణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముద్దాయిగా ఉన్నారని గుర్తు చేశారు. గత నాలుగున్నరేళ్లుగా ఆయన స్టే మీద ఉన్నారని తెలిపారు. రేవంత్ రెడ్డి ఢిల్లీలో రాజకీయంగా రెండు వైపులా

# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్




**ముంబై, ఏప్రిల్ 21 (తెలంగాణ ముచ్చట్లు):** అమెరికాఇరాన్ మధ్య శాంతి చర్చలు జరగబోతున్నాయన్న సంకేతాలతో అంతర్జాతీయ మార్కెట్లు లాభాల బాట పట్టాయి. అదే ప్రభావం దేశీయ స్టాక్ మార్కెట్‌పైనా కనిపించింది. క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గడం, ఆసియా మార్కెట్లలో సానుకూల ధోరణి కొనసాగడం, బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్లు పెరగడం వంటి అంశాలు సూచీలను పైకి లేపాయి.
ఈ నేపథ్యంలో సెన్సెక్స్ మంగళవారం ట్రేడింగ్‌ను 100 పాయింట్ల లాభంతో ప్రారంభించి, రోజంతా లాభాల్లోనే కొనసాగింది. చివరకు 753 పాయింట్లు ఎగిసి 79,273 వద్ద ముగిసింది. చాలా రోజుల తర్వాత 79 వేల మార్క్‌ను దాటడం గమనార్హం.
అలాగే నిఫ్టీ కూడా అదే దిశలో కదిలి, చివరకు 211 పాయింట్ల లాభంతో 24,576 వద్ద స్థిరపడింది.
రంగాల వారీగా చూస్తే బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లు ప్రధానంగా రాణించాయి. పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్, నెస్లే, ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్, నిప్పాన్, మణప్పురం ఫైనాన్స్ వంటి షేర్లు లాభాలు నమోదు చేశాయి. మరోవైపు ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, పాలీక్యాబ్, మ్యాక్స్ ఫైనాన్షియల్స్, సమ్మన్ క్యాపిటల్, ఐసీఐసీఐ లాంబార్డ్ షేర్లు నష్టాల్లో ముగిశాయి.
బ్యాంక్ నిఫ్టీ 789 పాయింట్లు పెరగగా, నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 295 పాయింట్లు లాభపడింది. విదేశీ మారకంలో రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే 93.49 వద్ద నమోదైంది.
మొత్తంగా అంతర్జాతీయ పరిణామాలు, క్రూడ్ ధరల పడిపోవడం, బ్యాంకింగ్ రంగం బలం కలిసివచ్చి మార్కెట్‌కు ఊపునిచ్చినట్లు నిపుణులు పేర్కొంటున్నారు.




# భాగ్యనగరంలో వంట నూనె ధరలు షాక్..

**హైదరాబాద్, ఏప్రిల్ 21 (తెలంగాణ ముచ్చట్లు):** భాగ్యనగరంలో వంట నూనె ధరలు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో వచ్చిన మార్పులు, ముడిసరుకు దిగుమతులపై ఉన్న ఆంక్షల కారణంగా నగరంలో నూనె రేట్లు ఒక్కసారిగా పెరిగాయి. ఈ పెరుగుదల మధ్యతరగతి కుటుంబాల నెలవారీ ఖర్చులపై తీవ్ర ప్రభావం చూపుతోంది.
ప్రస్తుతం మార్కెట్‌లో సన్‌ఫ్లవర్ నూనె లీటరు ధర సుమారు రూ.185 వరకు చేరుకుంది. అలాగే వేరుశనగ నూనె ధర లీటరుకు రూ.220 వరకు పెరిగింది. నిత్యావసర వస్తువులలో వంట నూనె ముఖ్యమైనదిగా ఉండటంతో, ఈ ధరల పెరుగుదల గృహ ఖర్చులను మరింత భారంగా మార్చుతోంది. గడిచిన రెండు వారాల్లోనే ఈ పెరుగుదల స్పష్టంగా కనిపించడం గమనార్హం. ముఖ్యంగా హైదరాబాద్ వంటి పెద్ద నగరాల్లో నూనె వినియోగం అధికంగా ఉండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
ఇక ముందు రోజుల్లో ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు హెచ్చరిస్తున్నాయి. సరఫరా లోపాలు కొనసాగితే రేట్లు మరింత ఎగిసే అవకాశముందని చెబుతున్నారు. దీంతో వినియోగదారులు ఖర్చులను తగ్గించుకునే ప్రయత్నంలో ఉన్నారు.
ప్రభుత్వం ఈ ధరల పెరుగుదలపై దృష్టి సారించి నియంత్రణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.




# ఇంటర్నెట్ లేకపోయినా యూపీఐ పేమెంట్స్..

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 21 (తెలంగాణ ముచ్చట్లు):** దేశంలో డిజిటల్ లావాదేవీలకు ఊపునిచ్చిన యూపీఐ అందుబాటులోకి వచ్చిన తర్వాత బ్యాంకింగ్ వ్యవస్థ పూర్తిగా మారిపోయింది. సెకన్లలోనే డబ్బులు పంపడం, పొందడం సులభం కావడంతో దీని వినియోగం భారీగా పెరిగింది. అయితే యూపీఐ పేమెంట్స్ చేయాలంటే తప్పనిసరిగా స్మార్ట్‌ఫోన్, ఇంటర్నెట్ అవసరమని చాలామంది భావిస్తుంటారు. కానీ వాస్తవానికి ఇంటర్నెట్ లేకపోయినా, స్మార్ట్‌ఫోన్ లేకపోయినా కూడా యూపీఐ ద్వారా చెల్లింపులు చేయడం సాధ్యమే. ఇందుకోసం ఎన్‌పీసీఐ ప్రత్యేక సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇంటర్నెట్ లేకుండా యూపీఐ వినియోగానికి మిస్డ్ కాల్ మరియు ఐవీఆర్ విధానం ఎంతో ఉపయోగపడుతోంది. నిర్దిష్ట నంబర్లకు కాల్ చేసి, వాయిస్ సూచనల ప్రకారం లావాదేవీ వివరాలు నమోదు చేస్తే చెల్లింపు పూర్తవుతుంది. అదే విధంగా మర్చంట్ ఇచ్చిన నంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చిన తర్వాత వచ్చే కాల్ ద్వారా కూడా పేమెంట్‌ను నిర్ధారించుకోవచ్చు. ఈ ప్రక్రియలో యూపీఐ పిన్ నమోదు చేయడం ద్వారా సురక్షితంగా డబ్బులు బదిలీ అవుతాయి.
ఫీచర్ ఫోన్లను ఉపయోగించే వారికి కూడా ప్రత్యేక డిజిటల్ సదుపాయాన్ని అందించారు. ఇందులో మొబైల్ నంబర్ నమోదు చేసి, బ్యాంక్ ఖాతాను లింక్ చేసి, ఓటీపీ ద్వారా యూపీఐ ఐడీ సృష్టించుకోవచ్చు. అనంతరం పిన్ సెట్ చేసుకుని సులభంగా చెల్లింపులు చేయవచ్చు. ఈ సేవలను ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్, జియో పేమెంట్స్ బ్యాంక్ వంటి సంస్థలు అందిస్తున్నాయి.
అలాగే కెమెరా ఉన్న సాధారణ ఫోన్ల ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి పేమెంట్స్ చేయడం కూడా సాధ్యమే. ఇక మర్చంట్ టెర్మినల్ మరియు వినియోగదారుడి ఫోన్ మధ్య ఆడియో సిగ్నల్స్ ద్వారా కూడా లావాదేవీలు జరిపే సాంకేతికత అందుబాటులో ఉంది.
మొత్తానికి, ఇంటర్నెట్ లేకపోయినా యూపీఐ పేమెంట్స్ చేయడం ఇప్పుడు సులభమైంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వారికి ఈ సౌకర్యం ఎంతో ఉపయోగకరంగా మారుతోంది.

# యాపిల్‌లో కీలక మార్పులు.. సీఈవోగా టిమ్ కుక్ తప్పుకోనున్నారు



**శాన్ ఫ్రాన్సిస్కో, ఏప్రిల్ 21 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రపంచ ప్రఖ్యాత టెక్ దిగ్గజం యాపిల్లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ఉన్న టిమ్ కుక్ తన పదవి నుంచి తప్పుకోనున్నారు. ఆయన ఇకపై కంపెనీ బోర్డులో ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. కంపెనీ కొత్త సీఈవోగా జాన్ టెర్నస్ నియమితులయ్యారు. ఈయన సెప్టెంబర్ 1 నుంచి అధికారికంగా బాధ్యతలు చేపట్టనున్నారు. అప్పటివరకు టిమ్ కుక్ సీఈవోగా కొనసాగుతూ, బాధ్యతలను టెర్నస్‌కు హస్తాంతరం చేయనున్నారు.
ప్రస్తుతం జాన్ టెర్నస్ యాపిల్‌లో హార్డ్‌వేర్ ఇంజినీరింగ్ విభాగానికి సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్నారు. కంపెనీ కీలక ఉత్పత్తుల అభివృద్ధిలో ఆయన కీలక పాత్ర పోషించారు.
టిమ్ కుక్ 1998లో యాపిల్‌లో చేరి, 2011లో సీఈవోగా బాధ్యతలు స్వీకరించారు. దాదాపు 15 ఏళ్ల పాటు ఆ పదవిలో కొనసాగుతూ సంస్థను కొత్త ఎత్తులకు తీసుకెళ్లారు. ఆయన నాయకత్వంలో యాపిల్ వాచ్, ఎయిర్‌పాడ్స్, విజన్ ప్రో వంటి ఉత్పత్తులు మార్కెట్లోకి వచ్చాయి. అలాగే ఐక్లౌడ్, యాపిల్ పే, యాపిల్ మ్యూజిక్ వంటి సేవలను కూడా విస్తరించారు.
సీఈవో పదవి నుంచి తప్పుకున్న తర్వాత కూడా టిమ్ కుక్ సంస్థకు మార్గదర్శకుడిగా కొనసాగుతూ, ప్రపంచవ్యాప్తంగా పాలసీ మేకర్లతో చర్చలు జరపనున్నారు. ఇక కొత్త సీఈవోగా బాధ్యతలు చేపట్టనున్న జాన్ టెర్నస్ కూడా యాపిల్‌లో దాదాపు 25 ఏళ్లుగా సేవలందిస్తున్న అనుభవజ్ఞుడు కావడం విశేషం.

# బంగారం, వెండి ధరల్లో ఊగిసలాట..



**హైదరాబాద్, ఏప్రిల్ 21 (తెలంగాణ ముచ్చట్లు):** అంతర్జాతీయ రాజకీయ, భౌగోళిక ఉద్రిక్తతల ప్రభావంతో బంగారం, వెండి ధరల్లో ఇటీవల భారీ హెచ్చుతగ్గులు నమోదవుతున్నాయి. ఈరోజు (మంగళవారం) ఉదయం పరిస్థితి ప్రకారం పసిడి ధరలు స్వల్ప మార్పులతో కొనసాగుతున్నాయి. తాజా గణాంకాల ప్రకారం 24 క్యారెట్ల బంగారం గ్రాము ధర రూ.15,528గా నమోదైంది. 22 క్యారెట్ల బంగారం గ్రాము రూ.14,234 వద్ద ఉండగా, 18 క్యారెట్ల పసిడి ధర రూ.11,646గా కొనసాగుతోంది. మరోవైపు వెండి ధర గ్రాముకు రూ.274గా, కిలోకు రూ.2,74,900గా ఉంది. దేశ రాజధాని న్యూఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం రూ.1,55,430గా ఉండగా, 22 క్యారెట్ల ధర రూ.1,42,490గా నమోదైంది. ఆర్థిక రాజధాని ముంబైలో 24 క్యారెట్ల బంగారం రూ.1,55,280గా, 22 క్యారెట్ల పసిడి రూ.1,42,340గా ఉంది. చెన్నైలో 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ.1,55,990గా ఉండగా, 22 క్యారెట్ల బంగారం రూ.1,42,990కి చేరుకుంది. తెలుగు రాష్ట్రాల్లో కూడా ఇలాంటి ధరలే కొనసాగుతున్నాయి. హైదరాబాద్లో 24 క్యారెట్ల బంగారం రూ.1,55,280గా ఉండగా, 22 క్యారెట్ల ధర రూ.1,42,340గా ఉంది. విజయవాడ, విశాఖపట్నంలో కూడా ఇదే స్థాయిలో ధరలు నమోదయ్యాయి. వెండి ధరల విషయానికి వస్తే, న్యూఢిల్లీలో కిలో వెండి రూ.2,74,900గా ఉండగా, చెన్నై, బెంగళూరులో రూ.2,79,900గా నమోదైంది. హైదరాబాద్, విజయవాడలో కూడా కిలో వెండి రూ.2,79,900గా కొనసాగుతోంది. మొత్తంగా అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో బంగారం, వెండి ధరలు ఇంకా మారే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

# క్రెడిట్ కార్డులతో డబ్బు సంపాదించవచ్చు..



క్రెడిట్ కార్డులు కేవలం షాపింగ్, బిల్లుల చెల్లింపులకు మాత్రమే పరిమితం కావు. వాటిని తెలివిగా, క్రమశిక్షణతో ఉపయోగిస్తే మంచి ఆర్థిక ప్రయోజనాలు పొందవచ్చు. ముఖ్యంగా 30 నుంచి 45 రోజుల వడ్డీ రహిత కాలం క్రెడిట్ కార్డులలో ప్రధాన ప్లస్ పాయింట్. ఈ సమయంలో చేసిన ఖర్చులను గడువు లోపు పూర్తిగా చెల్లిస్తే ఎలాంటి వడ్డీ ఉండదు.
జీతం వచ్చిన వెంటనే రోజువారీ ఖర్చులు, బిల్లులు అన్నీ క్రెడిట్ కార్డు ద్వారా చెల్లిస్తే, మీ దగ్గర డబ్బు కొంతకాలం ఉంటుంది. ఆ మొత్తాన్ని తక్కువ కాలం పెట్టుబడుల్లో పెట్టి వడ్డీ సంపాదించవచ్చు. అదే విధంగా నో కాస్ట్ ఈఎంఐ ఆఫర్లను సరిగ్గా ఉపయోగిస్తే పెద్ద మొత్తంలో కొనుగోళ్లు చేసినా మీ డబ్బు వెంటనే ఖర్చు కాకుండా ఉంటుంది. మిగిలిన డబ్బును పెట్టుబడిగా పెట్టి అదనపు ఆదాయం పొందవచ్చు.
క్రెడిట్ కార్డు వినియోగంపై వచ్చే రివార్డ్ పాయింట్లు, క్యాష్‌బ్యాక్‌లు కూడా ఒక రకంగా ఆదాయమే. వీటిని సరిగ్గా వినియోగించుకుంటే చిన్న మొత్తాల్లోనైనా మంచి సేవింగ్స్ పొందవచ్చు. అలాగే ప్రతి నెల బిల్లులను సమయానికి చెల్లించడం వల్ల సిబిల్ స్కోర్ మెరుగవుతుంది. మంచి స్కోర్ భవిష్యత్తులో తక్కువ వడ్డీతో రుణాలు పొందేందుకు ఉపయోగపడుతుంది.
అయితే, జాగ్రత్తలు పాటించకపోతే క్రెడిట్ కార్డులు భారంగా మారవచ్చు. ముఖ్యంగా డ్యూ డేట్ లోపు మొత్తం బిల్లు చెల్లించకపోతే అధిక వడ్డీలు పడతాయి. కనీస చెల్లింపు చేస్తూ కొనసాగితే అప్పు పెరుగుతూ ఉంటుంది. అందుకే ఎప్పుడూ పూర్తి బిల్లు చెల్లించడమే మంచిది.
అలాగే మీ ఆర్థిక స్థోమతకు మించి ఖర్చు చేయకూడదు. అవసరం లేని ఖర్చులను తగ్గించాలి. నో కాస్ట్ ఈఎంఐలు, ఇతర ఆఫర్ల నిబంధనలు తప్పనిసరిగా చదవాలి. దాచిన ఛార్జీలు ఉన్నాయా లేదా తెలుసుకోవాలి. వార్షిక రుసుములపై కూడా దృష్టి పెట్టాలి.
మొత్తానికి క్రెడిట్ కార్డులు ఒక శక్తివంతమైన ఆర్థిక సాధనం. సరైన విధంగా ఉపయోగిస్తే లాభం, లేకపోతే నష్టం తప్పదు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఈశాన్య రాష్ట్రాల్లో భూకంపం.. ప్రజల్లో భయాందోళన



- **మణిపూర్ కేంద్రంగా 5.2 తీవ్రతతో కంపనం**
- **పలు రాష్ట్రాల్లో భూమి కంపించిన ఘటన**
- **ప్రాణ, ఆస్తి నష్టం లేదని అధికారులు స్పష్టం**

**డెస్క్, ఏప్రిల్ 21 (తెలంగాణ ముచ్చట్లు):** ఈశాన్య భారత రాష్ట్రాల్లో మంగళవారం ఉదయం భూకంపం సంభవించి ప్రజలను భయాందోళనలకు గురి చేసింది. భూకంపం రూపంలో నమోదైన ఈ ప్రకంపనలు ముఖ్యంగా మణిపూర్ కేంద్రంగా సంభవించాయి. తెల్లవారుజామున ప్రజలు నిద్రలో ఉండగానే ఈ ఘటన జరగడంతో ఒక్కసారిగా భూమి కంపించడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఈ భూకంప ప్రభావం నాగాలాండ్, అస్సాం, మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లోనూ కనిపించింది. పలు ప్రాంతాల్లో కొన్ని క్షణాల పాటు భూమి కంపించడంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈశాన్య ప్రాంతంలో ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్న నేపథ్యంలో ప్రజల్లో భయం మరింత పెరిగింది.

జాతీయ భూకంప పరిశోధన కేంద్రం వెల్లడించిన వివరాల ప్రకారం మంగళవారం ఉదయం 5 గంటల 59 నిమిషాలకు ఈ భూకంపం సంభవించింది. రిక్టర్ ప్రమాణం పై దీని తీవ్రత 5.2గా నమోదైంది. భూకంప కేంద్రం మణిపూర్‌లోని కామ్‌జాంగ్ జిల్లాలో భూమికి సుమారు 62 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ ఘటనలో ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం సంభవించలేదని స్థానిక అధికారులు తెలిపారు. అధికారులు పరిస్థితిని సమీక్షిస్తూ సహాయక బృందాలను అప్రమత్తం చేశారు. తరచూ భూకంపాలు సంభవిస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# అఫిడవిట్‌లో తేడాలు



- **ఉదయనిధి స్టాలిన్‌పై ఐటీ శాఖ ఆరోపణలు**
- **పెట్టుబడుల వివరాల్లో అసంగతతలు వెలుగులోకి**
- **బ్యాంకు రుణాల గణాంకాల్లో గందరగోళం**
- **మద్రాసు హైకోర్టులో విచారణ కొనసాగింపు**

**చెన్నై, ఏప్రిల్ 21 (తెలంగాణ ముచ్చట్లు):** డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ ఎన్నికల అఫిడవిట్‌పై ఆదాయపు పన్ను శాఖ కీలక ఆరోపణలు చేసింది. 2021 ఎన్నికల అఫిడవిట్‌లో రెడ్ గెయింట్ మూవీస్ సంస్థలో రూ.7.36 కోట్ల పెట్టుబడి పెట్టినట్లు పేర్కొనగా, 2026 అఫిడవిట్‌లో ఆ వివరాలను ప్రస్తావించలేదని ఐటీ శాఖ వెల్లడించింది. దీనిపై మద్రాసు హైకోర్టులో సమర్పించిన కౌంటర్ అఫిడవిట్‌లో ఈ అంశాన్ని స్పష్టంగా ప్రస్తావించింది. అదేవిధంగా, అదే సంస్థలో ఉదయనిధి స్టాలిన్ భార్య పేరుపై సుమారు రూ.2.63 కోట్ల పెట్టుబడి ఉన్నట్లు తాజా అఫిడవిట్‌లో పేర్కొనబడింది. అయితే ఈ వివరాలు గత అఫిడవిట్‌లో లేకపోవడం గమనార్హం. పెట్టుబడుల వివరాల్లో ఈ విధమైన మార్పులు అనుమానాలకు తావిస్తున్నాయని ఆదాయపు పన్ను శాఖ తెలిపింది. బ్యాంకు రుణాల విషయంలో కూడా గణాంకాల్లో స్పష్టత లేకపోవడం వెలుగులోకి వచ్చింది. 2026 అఫిడవిట్ ప్రకారం రూ.10 కోట్ల రుణం తీసుకున్నట్లు ఉండగా, 2021 అఫిడవిట్‌లో అది రూ.11.06 కోట్లుగా చూపించారు. అయితే కంపెనీ రికార్డుల ప్రకారం సుమారు రూ.18 కోట్ల రుణం ఉన్నట్లు ఐటీ శాఖ గుర్తించింది. ఈ తేడాలపై శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో పన్ను రిటర్నులను నిర్దిష్ట నమూనాలో మళ్లీ దాఖలు చేయాలని ఐటీ శాఖ సూచించింది. చెన్నైకు చెందిన ఆర్ కుమారవేల్ దాఖలు చేసిన పిటిషన్ ఆధారంగా ఈ కేసు విచారణ కొనసాగుతోంది. ఎన్నికల అఫిడవిట్ ప్రకారం ఉదయనిధి స్టాలిన్ తన మొత్తం ఆస్తుల విలువను సుమారు రూ.20.6 కోట్లుగా వెల్లడించారు. ఇందులో రూ.12.9 కోట్లు చరాస్తులు కాగా, రూ.7.7 కోట్లు స్థిరాస్తులుగా ఉన్నాయి. 202425 సంవత్సరానికి ఆయన ఆదాయం రూ.10 లక్షలు కాగా, ఆయన భార్య ఆదాయం రూ.2.9 కోట్లుగా నమోదైంది.

# తమిళనాడులో ఎన్నికల కట్టుదిట్టం.. రూ.1200 కోట్ల సీజ్




- **పోలింగ్‌కు ముందు భారీ తనిఖీలు**
- **నగదు, బంగారం, మద్యం స్వాధీనం**
- **సున్నిత కేంద్రాల్లో కఠిన భద్రత ఏర్పాట్లు**

**చెన్నై, ఏప్రిల్ 21 (తెలంగాణ ముచ్చట్లు):** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు మరికొన్ని రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో అధికారులు తనిఖీలను మరింత కట్టుదిట్టం చేశారు. ఏప్రిల్ 23న జరగనున్న పోలింగ్‌కు ముందు రాష్ట్రవ్యాప్తంగా భారీగా నగదు, బంగారం, మద్యం, మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటివరకు పట్టుబడిన సొమ్ము, వస్తువుల మొత్తం విలువ రూ.1200 కోట్లు దాటిందని ఎన్నికల అధికారులు వెల్లడించారు. ఎన్నికల పర్యవేక్షణ బృందాలు నేరుగా రూ.500 కోట్లకు పైగా విలువైన నగదు, వస్తువులను సీజ్ చేయగా, మిగతా మొత్తాన్ని ఆదాయపు పన్ను శాఖ సహా ఇతర అమలు సంస్థలు సోదాల్లో స్వాధీనం చేసుకున్నాయి. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఉద్దేశించిన మద్యం, నిషేధిత పదార్థాలు, ఇతర ఉచితాల పంపిణీపై ఫిర్యాదులు రావడంతో అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలకు సంబంధించి సుమారు వంద కేసులు నమోదు చేశారు.

జిల్లాల వారీగా పరిశీలిస్తే తిరువళ్లూరులో అత్యధికంగా సొమ్ము పట్టుబడగా, తరువాత చెన్నై ప్రాంతం నిలిచింది. రాష్ట్రవ్యాప్తంగా 95 శాతానికి పైగా ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తయిందని అధికారులు తెలిపారు. మొత్తం 234 నియోజకవర్గాల్లో 105 నియోజకవర్గాలను ఎన్నికల వ్యయ పరంగా సున్నితమైనవిగా గుర్తించారు. మొత్తం 5,938 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించి అక్కడ అదనపు భద్రతను ఏర్పాటు చేశారు. ఇప్పటికే 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు కలిపి రెండు లక్షల మందికి పైగా ఓటర్లు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాష్ట్రంలో స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా పోలింగ్ నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, కేంద్ర సాయుధ బలగాలను కూడా మోహరించామని ఎన్నికల అధికారులు తెలిపారు.

# అమెరికా–ఇరాన్ శాంతి చర్చలకు రంగం సిద్ధం



- **ఇస్లామాబాద్‌లో కీలక సమావేశం ఏర్పాట్లు**
- **ఇరాన్ హాజరుపై ఇంకా స్పష్టత లేదు**
- **డిమాండ్లతో ఉద్రిక్తత కొనసాగింపు**

**ఇస్లామాబాద్, ఏప్రిల్ 21 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):** అంతర్జాతీయంగా తీవ్ర ఉత్కంఠ రేపుతున్న అమెరికా, ఇరాన్ మధ్య శాంతి చర్చలకు రంగం సిద్ధమైంది. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో ఈ వారం ఇస్లామాబాద్‌లో ఈ చర్చలు జరగనున్నాయి. ఒకవేళ ఒప్పందం కుదిరితే, దానిపై సంతకం చేయడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా లేదా వర్చువల్‌గా హాజరయ్యే అవకాశం ఉందని అంతర్జాతీయ వార్తా సంస్థలు పేర్కొన్నాయి. ఇరు దేశాల మధ్య అమలులో ఉన్న రెండు వారాల కాల్పుల విరమణ గడువు ముగియనున్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే ఈ చర్చల్లో ఇరాన్ పాల్గొంటుందా లేదా అనే అంశంపై ఇంకా స్పష్టత లేదు. ఇటీవల హర్మూజ్ జలసంధి సమీపంలో ఇరాన్‌కు చెందిన నౌకను అమెరికా స్వాధీనం చేసుకోవడంతో చర్చలకు హాజరుకాబోమని టెహ్రాన్ మొదట ప్రకటించింది. కానీ తాజాగా తమ వైఖరిని సానుకూలంగా సమీక్షిస్తున్నామని, తుది నిర్ణయం తీసుకోలేదని ఇరాన్ ఉన్నతాధికారులు సంకేతాలు ఇచ్చినట్లు సమాచారం. చర్చలు జరుగుతాయనే నమ్మకాన్ని అమెరికా వ్యక్తం చేస్తోంది.

ఈ కీలక చర్చల కోసం అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పాకిస్థాన్‌కు వెళ్లనున్నట్లు సమాచారం. చర్చలు విజయవంతం కావడానికి ఇరు దేశాల డిమాండ్లు ప్రధాన అడ్డంకిగా మారాయి. చమురు ధరలు, ఆర్థిక పరిస్థితులు దెబ్బతినకుండా ఉండే ఒప్పందం కోసం అమెరికా ప్రయత్నిస్తుండగా, ఇరాన్ అణు సామర్థ్యంపై కఠిన పరిమితులు విధించాలని అమెరికా పట్టుబడుతోంది. మరోవైపు, తమపై ఉన్న ఆంక్షలను సడలిస్తూ యుద్ధాన్ని నివారించే ఒప్పందం కోసం ఇరాన్ ఎదురుచూస్తోంది. అయితే తమ అణు కార్యక్రమంపై ఎలాంటి పరిమితులు ఉండకూడదని స్పష్టం చేస్తోంది. చర్చలు విఫలమైతే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఇరు దేశాలు హెచ్చరికలు జారీ చేస్తున్నాయి. ఇదిలావుంటే, మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న పాకిస్థాన్ ఈ చర్చల కోసం భారీ భద్రతా ఏర్పాట్లు చేసింది. ఇస్లామాబాద్‌లో దాదాపు 20 వేల మంది భద్రతా సిబ్బందిని మోహరించినట్లు అధికారులు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి రేపుతున్న ఈ చర్చల ఫలితంపై అందరూ ఎదురుచూస్తున్నారు.

# ఐసీఏఎస్ అధికారుల శిక్షణార్థులతో ఆర్థిక మంత్రి సమావేశం

- **న్యూఢిల్లీ లో అధికారులతో పరస్పర చర్చ**
- **భవిష్యత్ పరిపాలనపై మార్గదర్శకాలు**
- **సీనియర్ అధికారుల సమక్షంలో కార్యక్రమం**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 21 (తెలంగాణ ముచ్చట్లు):** కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి నిర్మలా సీతారామన్ న్యూఢిల్లీలో భారత సివిల్ అకౌంట్స్ సర్వీస్ (ఐసీఏఎస్) 2024 బ్యాచ్ అధికారుల శిక్షణార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పరిపాలన, ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ పరస్పర కార్యక్రమంలో శిక్షణార్థుల బాధ్యతలు, భవిష్యత్ సవాళ్లు, ప్రభుత్వ ఆర్థిక నిర్వహణలో వారి పాత్రపై మంత్రి సూచనలు చేశారు. ప్రభుత్వ విధానాలను సమర్థవంతంగా అమలు చేయడంలో పారదర్శకత, బాధ్యతాయుతత అవసరమని ఆమె పేర్కొన్నారు.

ఈ సమావేశంలో కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ టి సి ఏ కళ్యాణి, ఐఎన్‌జీఏఎఫ్ డైరెక్టర్ జనరల్ ఏ ఎస్ సందు కూడా పాల్గొన్నారు. శిక్షణార్థులకు వారు కూడా మార్గదర్శకాలు అందించారు.

ప్రభుత్వ ఆర్థిక వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహించడంలో ఐసీఏఎస్ అధికారుల పాత్ర ఎంతో కీలకమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఖచ్చితమైన లెక్కలు, పారదర్శక వ్యవహారాలు పరిపాలనలో నమ్మకాన్ని పెంచుతాయని వివరించారు.

దేశ అభివృద్ధిలో పరిపాలనా వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందని, అందులో యువ అధికారుల పాత్ర మరింత ప్రాధాన్యం సంతరించుకుంటుందని మంత్రి అభిప్రాయపడ్డారు. నిబద్ధతతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ సమావేశం ద్వారా శిక్షణార్థులకు విలువైన మార్గదర్శకాలు లభించాయని అధికారులు తెలిపారు. భవిష్యత్ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఇది ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు.



# నగరాల్లో పెరుగుతున్న గాలి కాలుష్యం

## వేగంగా పెరుగుతున్న కాలుష్య స్థాయిలు.. ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావాలు.. పరిష్కారాల దిశగా సమిష్టి చర్య అవసరం

నగరాల్లో గాలి కాలుష్యం సమస్య రోజురోజుకు తీవ్రమవుతోంది. వేగంగా పెరుగుతున్న పట్టణీకరణ, వాహనాల పెరుగుదల, పరిశ్రమల విస్తరణ ఇవి కలిసి గాలి నాణ్యతను దెబ్బతీస్తున్నాయి. ఒకప్పుడు పరిశుభ్రమైన వాతావరణం కలిగిన నగరాలు ఇప్పుడు పొగమంచుతో కప్పబడి ఉండే పరిస్థితి ఏర్పడింది. ప్రజలు రోజూ శ్వాసించే గాలి క్రమంగా ప్రమాదకరంగా మారుతోంది. ప్రస్తుతం గాలి కాలుష్యాన్ని కొలిచే సూచికలు చాలా నగరాల్లో ప్రమాదకర స్థాయిలను చూపిస్తున్నాయి. ఈ పరిస్థితి కేవలం ఒక నగరానికి మాత్రమే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా విస్తరిస్తోంది. కాలుష్యం కారణంగా ఉదయం వేళల్లో కూడా శుభ్రమైన గాలి దొరకడం కష్టంగా మారింది. ఇది ప్రజల దైనందిన జీవితాన్ని ప్రభావితం చేస్తోంది.



గాలి కాలుష్యం ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతోంది. ముఖ్యంగా శ్వాసకోశ సంబంధిత వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయి. ఆస్తమా, ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్లు, అలర్జీలు ఇవి సాధారణ సమస్యలుగా మారాయి. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు ఈ కాలుష్యానికి అత్యంత సున్నితంగా స్పందిస్తున్నారు. దీర్ఘకాలికంగా గాలి కాలుష్యం హృదయ సంబంధిత వ్యాధులకు కూడా కారణమవుతోంది. రక్తపోటు, గుండెపోటు ప్రమాదాలు పెరుగుతున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కాలుష్య గాలిలో ఉండే సూక్ష్మ కణాలు రక్తంలోకి ప్రవేశించి శరీరానికి తీవ్రమైన నష్టం కలిగిస్తున్నాయి. ఇది నిశ్శబ్దంగా ఆరోగ్యాన్ని క్షీణింపజేస్తున్న పెద్ద సమస్యగా మారింది.

గాలి కాలుష్యం మానసిక ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతోందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. నిరంతరం కాలుష్య వాతావరణంలో జీవించడం వల్ల ఒత్తిడి, ఆందోళన పెరుగుతున్నాయి. శరీర ఆరోగ్యంతో పాటు మనసుకు కూడా ఈ సమస్య ప్రభావం చూపడం ఆందోళనకర విషయం. ఈ సమస్యకు ప్రధాన కారణాల్లో వాహనాల అధిక వినియోగం ఒకటి. ప్రతి కుటుంబంలో ఒకటి కంటే ఎక్కువ వాహనాలు ఉండటం సాధారణమైపోయింది. దీనివల్ల వాహనాల నుంచి వెలువడే పొగలు గాలి నాణ్యతను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. ప్రజలు సౌకర్యం కోసం వ్యక్తిగత వాహనాలపై ఆధారపడటం ఈ సమస్యను మరింత పెంచుతోంది.

పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యం కూడా ఒక ప్రధాన కారణం. నియంత్రణ చర్యలు ఉన్నప్పటికీ, వాటి అమలు పూర్తిగా కచ్చితంగా జరగడం లేదు. కొన్ని పరిశ్రమలు నియమాలను పట్టించుకోకుండా కాలుష్యాన్ని విడుదల చేస్తున్నాయి. ఇది పరిసర ప్రాంతాల ప్రజల ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపుతోంది. చెట్ల కొరత కూడా గాలి కాలుష్యాన్ని పెంచుతోంది. పట్టణాల్లో గ్రీన్ కవర్ తగ్గిపోవడం వల్ల గాలిని శుద్ధి చేసే సహజ వనరులు తగ్గుతున్నాయి. అభివృద్ధి పేరుతో చెట్లను నరికివేయడం సమస్యను మరింత తీవ్రము చేస్తోంది. ప్రకృతి సమతౌల్యం కోల్పోవడం వల్ల కాలుష్యం నియంత్రణలోకి రావడం లేదు.

ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు కొంతవరకు ఫలితాలు ఇస్తున్నప్పటికీ, అవి సరిపోవడం లేదు. కఠినమైన నియమాలు, వాటి అమలు, ప్రజల్లో అవగాహన ఇవి సమన్వయంగా ఉండాలి. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ అభివృద్ధి, పరిశ్రమల నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ చర్యలు మరింత బలంగా అమలు కావాలి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరం. ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంగా బాధ్యత వహించి చిన్నచిన్న మార్పులు చేయాలి. వాహనాల వినియోగం తగ్గించడం, చెట్లు నాటడం, పర్యావరణానికి అనుకూలమైన జీవనశైలిని అనుసరించడం ద్వారా మాత్రమే గాలి కాలుష్యాన్ని తగ్గించవచ్చు. స్వచ్ఛమైన గాలి అందరికీ అందాలంటే ఇప్పుడే చర్యలు ప్రారంభించడం తప్పనిసరి. గాలి కాలుష్యం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. శ్వాస సంబంధిత సమస్యలు, ఆస్తమా, బ్రాంకైటిస్ వంటి వ్యాధులు పెరుగుతున్నాయి. చిన్నపిల్లలు, వృద్ధులు ఎక్కువగా ప్రభావితమవుతున్నారు. గాలి నాణ్యత చెడిపోవడం వల్ల హృదయ సంబంధిత సమస్యలు కూడా పెరుగుతున్నాయి. దీర్ఘకాలికంగా ఇది ప్రాణాంతక పరిస్థితులకు దారి తీస్తోంది. కాలుష్యానికి ప్రధాన కారణాలు మన జీవనశైలిలోనే ఉన్నాయి. ఎక్కువగా వ్యక్తిగత వాహనాల వినియోగం, ఫ్యాక్టరీల నుంచి వచ్చే కాలుష్య నియంత్రణలో లోపాలు, చెట్లు తగ్గిపోవడం ఇవి సమస్యను మరింత పెంచుతున్నాయి. ప్రభుత్వం కొన్ని నియంత్రణ చర్యలు తీసుకుంటున్నప్పటికీ, అమలు పరంగా ఇంకా లోపాలే కనిపిస్తున్నాయి. ఈ సమస్యకు పరిష్కారం కోసం ప్రభుత్వం మాత్రమే కాకుండా ప్రజలు కూడా బాధ్యత వహించాలి. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ వినియోగం పెంచడం, చెట్లు నాటడం, కాలుష్య నియంత్రణ నిబంధనలు కచ్చితంగా అమలు చేయడం వంటి చర్యలు అవసరం. గాలి కాలుష్యం తగ్గించడంలో సమిష్టి కృషి మాత్రమే దీర్ఘకాలిక ఫలితాలు ఇస్తుంది. నగరాల్లో స్వచ్ఛమైన గాలి అందుబాటులో ఉండాలంటే ఇప్పుడే చర్యలు తీసుకోవడం అత్యవసరం.

కాలుష్యానికి ప్రధాన కారణాలు మన జీవనశైలిలోనే ఉన్నాయి. ఎక్కువగా వ్యక్తిగత వాహనాల వినియోగం, ఫ్యాక్టరీల నుంచి వచ్చే కాలుష్య నియంత్రణలో లోపాలు, చెట్లు తగ్గిపోవడం ఇవి సమస్యను మరింత పెంచుతున్నాయి. ప్రభుత్వం కొన్ని నియంత్రణ చర్యలు తీసుకుంటున్నప్పటికీ, అమలు పరంగా ఇంకా లోపాలే కనిపిస్తున్నాయి. ఈ సమస్యకు పరిష్కారం కోసం ప్రభుత్వం మాత్రమే కాకుండా ప్రజలు కూడా బాధ్యత వహించాలి. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ వినియోగం పెంచడం, చెట్లు నాటడం, కాలుష్య నియంత్రణ నిబంధనలు కచ్చితంగా అమలు చేయడం వంటి చర్యలు అవసరం. గాలి కాలుష్యం తగ్గించడంలో సమిష్టి కృషి మాత్రమే దీర్ఘకాలిక ఫలితాలు ఇస్తుంది. నగరాల్లో స్వచ్ఛమైన గాలి అందుబాటులో ఉండాలంటే ఇప్పుడే చర్యలు తీసుకోవడం అత్యవసరం.

# సేవలకు గుర్తింపు – ఉత్సాహానికి ప్రేరణ

**జాతీయ పరిపాలనా సిబ్బంది దినోత్సవం**

**కార్యాలయ వ్యవస్థకు అండగా నిలిచే సేవలకు గౌరవం**

**కార్యాలయ నిర్వహణలో కీలక బాధ్యతలు**

**సిబ్బంది సమన్వయంతో సంస్థల విజయగాథ**



కార్యాలయాల సజావుగా నడిచే వ్యవస్థకు పునాది వేసే పరిపాలనా సిబ్బంది సేవలను గుర్తిస్తూ ప్రతి సంవత్సరం జాతీయ పరిపాలనా సిబ్బంది దినోత్సవాన్ని జరుపుకుంటారు. సంస్థల రోజువారీ కార్యకలాపాలు సక్రమంగా సాగడానికి ఈ సిబ్బంది నిర్వహించే పనులు అత్యంత కీలకంగా ఉంటాయి. ఫైల్ నిర్వహణ, సమావేశాల సమన్వయం, సమాచార పరస్పర వినిమయం వంటి అనేక బాధ్యతలను వీరు సమర్థవంతంగా నిర్వహిస్తారు. అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది కార్యాలయాల్లో కనిపించని శక్తిలా వ్యవహరిస్తారు. వారి కృషి లేకుండా ఏ సంస్థ కూడా సజావుగా ముందుకు సాగడం కష్టమే. అధికారులు, ఉద్యోగులు, వినియోగదారుల మధ్య అనుసంధానంగా నిలుస్తూ, పనుల వేగాన్ని పెంచడంలో వీరి పాత్ర ఎంతో ముఖ్యమైంది. సమయపాలన, క్రమబద్ధత, సమన్వయం వంటి లక్షణాలతో వారు సంస్థల అభివృద్ధికి తోడ్పడుతున్నారు. ప్రస్తుత కాలంలో సాంకేతిక పరిజ్ఞానం పెరిగినా, పరిపాలనా సిబ్బంది అవసరం తగ్గలేదు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కొత్త నైపుణ్యాలను అలవరచుకుంటూ, డిజిటల్ వ్యవస్థలతో పాటు సంప్రదాయ విధానాలను సమర్థంగా ఉపయోగిస్తున్నారు. సంస్థల సామర్థ్యాన్ని పెంచడంలో, పని తీరును మెరుగుపరచడంలో వీరి కృషి అనిర్వచనీయమైనది. ఈ దినోత్సవం సందర్భంగా సంస్థలు తమ సిబ్బందిని సత్కరించడం, అభినందించడం, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. ఇది సిబ్బందిలో ఉత్సాహాన్ని పెంచడమే కాకుండా, వారి సేవలకు విలువనిచ్చే వాతావరణాన్ని సృష్టిస్తుంది. ఉద్యోగ సంతృప్తి పెరగడం ద్వారా సంస్థల పనితీరు కూడా మెరుగుపడుతుంది.

పరిపాలనా సిబ్బంది అనేక ఒత్తిడులను ఎదుర్కొంటూ తమ బాధ్యతలను నిర్వహిస్తారు. పని ఒత్తిడి, సమయపాలన, అనేక పనులను ఒకేసారి నిర్వహించడం వంటి సవాళ్లను అధిగమిస్తూ వారు తమ పనిని కొనసాగిస్తారు. ఈ నేపథ్యంలో వారి కృషిని గుర్తించడం సమాజం మొత్తం బాధ్యతగా మారింది. సంస్థల విజయానికి వెనుక నిలిచే ఈ సిబ్బంది పాత్రను మరింతగా గుర్తించాల్సిన అవసరం ఉంది. వారికి తగిన శిక్షణ, సదుపాయాలు కల్పించడం ద్వారా వారి సామర్థ్యాన్ని పెంచవచ్చు. ఇది సంస్థల పురోగతికి కూడా దోహదం చేస్తుంది.

యువతలో పరిపాలనా రంగంపై ఆసక్తి పెరుగుతోంది. కార్యాలయ నిర్వహణ, సమన్వయం, కమ్యూనికేషన్ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం ద్వారా ఈ రంగంలో మంచి అవకాశాలు లభిస్తున్నాయి. భవిష్యత్తులో ఈ రంగం మరింత విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. జాతీయ పరిపాలనా సిబ్బంది దినోత్సవం మనకు కార్యాలయాల వెనుక నడిచే అసలు శక్తిని గుర్తు చేస్తుంది. వారి సేవలను గౌరవిస్తూ, ప్రోత్సహించడం ద్వారా సంస్థల అభివృద్ధికి బలమైన పునాది ఏర్పడుతుంది.

# ప్రకృతి పరిరక్షణే మానవాళి భవిష్యత్

ప్రతి సంవత్సరం ఏప్రిల్ 22న ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే ప్రపంచ భూమి దినోత్సవం పర్యావరణ పరిరక్షణకు అంకితమైన ముఖ్యమైన సందర్భంగా నిలుస్తోంది. భూమి మనకు అందిస్తున్న సహజ వనరులు, జీవ వైవిధ్యం, సహజ సమతుల్యతను కాపాడుకోవాల్సిన అవసరాన్ని ఈ రోజు గుర్తు చేస్తుంది. కాలుష్యం, అరణ్య నిర్మూలనం, వాతావరణ మార్పులు వంటి సమస్యలు పెరుగుతున్న తరుణంలో ఈ దినోత్సవం ప్రాధాన్యం మరింత పెరిగింది. ఈ దినోత్సవం మొదటిసారి నిర్వహించబడినప్పటి నుంచి ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజల్లో పర్యావరణంపై అవగాహన పెరిగింది. పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పలు కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రకృతి పరిరక్షణపై చైతన్యం కల్పిస్తున్నారు. చెట్లు నాటడం, పర్యావరణ శుభ్రత కార్యక్రమాలు నిర్వహించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం వంటి చర్యలు విస్తృతంగా చేపడుతున్నారు.



పర్యావరణ కాలుష్యం ప్రస్తుతం ప్రపంచానికి అతిపెద్ద సవాలుగా మారింది. వాయు కాలుష్యం, నీటి కాలుష్యం, భూమి కాలుష్యం వంటి సమస్యలు మన ఆరోగ్యానికే కాకుండా జీవ వ్యవస్థలకు కూడా ముప్పుగా మారుతున్నాయి. ముఖ్యంగా పట్టణాల్లో కాలుష్యం అధికంగా ఉండడం వల్ల ప్రజలు అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితిని నియంత్రించడానికి ప్రభుత్వ చర్యలతో పాటు ప్రజల సహకారం కూడా ఎంతో అవసరం. అరణ్యాల నిర్మూలనం వల్ల భూమి సమతుల్యత దెబ్బతింటోంది. అడవులు తగ్గిపోవడం వల్ల వాతావరణ మార్పులు వేగవంతమవుతున్నాయి. చెట్లు కార్బన్ డయాక్సైడ్‌ను శోషించి ఆక్సిజన్‌ను విడుదల చేయడం ద్వారా భూమి ఉష్ణోగ్రతను నియంత్రిస్తాయి. అందువల్ల చెట్లు నాటడం, అడవులను సంరక్షించడం అత్యంత ముఖ్యమైన చర్యలుగా నిపుణులు సూచిస్తున్నారు.

2026 సంవత్సరానికి "మన శక్తి - మన భూమి" అనే థీమ్‌ను నిర్ణయించడం ద్వారా ప్రతి ఒక్కరి పాత్ర ఎంత కీలకమో తెలియజేస్తున్నారు. విద్యుత్ వినియోగంలో మితవ్యయత పాటించడం, పునరుత్పత్తి శక్తి వనరులను వినియోగించడం, ఇంధన వినియోగాన్ని తగ్గించడం వంటి చర్యలు ఈ థీమ్ ప్రధాన సందేశంగా నిలుస్తున్నాయి. చిన్న మార్పులు కూడా పెద్ద మార్పులకు దారితీస్తాయని ఈ సందేశం తెలియజేస్తోంది.

**ప్రపంచ భూమి దినోత్సవం**

**భూమి సంరక్షణపై అంతర్జాతీయ చైతన్యం**

**కాలుష్య నియంత్రణలో ప్రతి ఒక్కరి బాధ్యత**

**"మన శక్తి – మన భూమి" థీమ్ సందేశం**

ప్రస్తుతం వాతావరణ మార్పులు ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన ప్రభావం చూపుతున్నాయి. ఉష్ణోగ్రతలు పెరగడం, హిమనదులు కరుగడం, సముద్ర మట్టం పెరగడం వంటి పరిణామాలు మన కళ్ల ముందే జరుగుతున్నాయి. ఈ మార్పులు భవిష్యత్ తరాలకు పెద్ద ప్రమాదంగా మారే అవకాశం ఉంది. అందువల్ల ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవడం అత్యవసరమైంది. ప్రభుత్వాలు పర్యావరణ పరిరక్షణ కోసం పలు విధానాలు అమలు చేస్తున్నప్పటికీ, ప్రజల భాగస్వామ్యం లేకుండా ఈ లక్ష్యం సాధ్యం కాదు. ప్రతి ఒక్కరు తమ రోజువారీ జీవితంలో చిన్న చిన్న మార్పులు చేసుకోవడం ద్వారా పెద్ద ఫలితాలను సాధించవచ్చు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, నీటిని ఆదా చేయడం, చెట్లు నాటడం వంటి చర్యలు ప్రతి ఒక్కరి బాధ్యతగా మారాలి. భూమి మనకు ఇచ్చిన సంపదను సంరక్షించడం మనందరి కర్తవ్యం. ప్రకృతితో సమతుల్యతను కాపాడుకుంటూ జీవించడం ద్వారానే మన భవిష్యత్ తరాలకు సురక్షితమైన ప్రపంచాన్ని అందించగలం. ప్రపంచ భూమి దినోత్సవం మనకు ఈ బాధ్యతను గుర్తు చేస్తూ, ప్రకృతి పరిరక్షణ దిశగా ముందడుగు వేయాలని పిలుపునిస్తోంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## పాన్ ఇండియా దిశగా ఎన్టీఆర్.. వరుస భారీ ప్రాజెక్టులతో ఫుల్ బిజీ

టాలీవుడ్ స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్ "ఆర్ఆర్ఆర్" తర్వాత తన కెరీర్‌ను పూర్తిగా పాన్ ఇండియా స్థాయిలో విస్తరించుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన ఆ చిత్రంతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన తారక్, ఆ తర్వాత కొరటాల శివ దర్శకత్వంలో చేసిన "దేవర పార్ట్ 1"తో తన మార్కెట్‌ను మరింత పెంచుకున్నాడు.

అయితే బాలీవుడ్‌లో చేసిన "వార్ 2" భారీ అంచనాల మధ్య విడుదలై ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. "టెంపర్" తర్వాత వరుస విజయాలతో దూసుకెళ్తున్న ఎన్టీఆర్‌కు ఇది ఒక చిన్న బ్రేక్‌లా మారిందని విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఎన్టీఆర్, స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్నాడు. ఈ సినిమాకు "డ్రాగన్" అనే టైటిల్ పరిశీలనలో ఉందని సమాచారం. మొదట అనుకున్న కథకు బదులుగా కొత్త కథతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. షూటింగ్ ఆలస్యాల కారణంగా విడుదల వాయిదా పడగా, తాజాగా ఈ సినిమాను వచ్చే ఏడాది జూన్ 11న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. విడుదల చేసిన పోస్టర్‌లో కొండపై నిలబడి ఉన్న ఎన్టీఆర్ లుక్ అభిమానులను ఆకట్టుకుంది. అలాగే మే 20న ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఫస్ట్ గ్లింప్స్ విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు.

ఇక ఈ సినిమా తర్వాత "దేవర పార్ట్ 2" కూడా లైన్‌లో ఉంది. అదే సమయంలో దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్తో కూడా ఎన్టీఆర్ ఓ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. సితార ఎంటర్టైన్మెంట్స్ ఈ చిత్రాన్ని నిర్మించనుంది.

## 'వాలా 2' తెలుగు ట్రైలర్ విడుదల..




మలయాళ చిత్ర పరిశ్రమలో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సాధించిన బ్లాక్‌బస్టర్ మూవీ "వాలా 2" ఇప్పుడు తెలుగు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ చిత్ర తెలుగు ట్రైలర్‌ను నాని సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు.

ట్రైలర్‌ను పరిశీలిస్తే, ఇది కేవలం వినోదానికే పరిమితం కాకుండా యువత ఆలోచనలు, వారి జీవన పోరాటాన్ని ప్రతిబింబించే కథగా కనిపిస్తోంది. చదువులో వెనుకబడిన, ఇంట్లో విమర్శలు ఎదుర్కొంటూ, సమాజంలో తమకంటూ గుర్తింపు కోసం ప్రయత్నించే నలుగురు యువకుల కథగా ఈ చిత్రం తెరకెక్కింది. కామెడీ, భావోద్వేగాలు, స్నేహం కలగలిసి ఈ సినిమా యూత్‌ను ఆకట్టుకునేలా ఉంది.

మలయాళంలో ఈ చిత్రం ఇప్పటికే రూ.210 కోట్లకు పైగా వసూళ్లు సాధించి రికార్డులు సృష్టించింది. తెలుగులో ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత సాహు గారపాటి తన షైన్ స్క్రీన్స్ పతాకంపై గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు.

ఈ చిత్రంలో హషీర్, అలన్ బిన్ సిరాజ్, అజిన్ జాయ్, వినాయక్ ప్రధాన పాత్రల్లో నటించగా, దర్శకుడు సావిన్ ఎస్ఏ సినిమాను రూపొందించారు. ఇప్పటికే ట్రైలర్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతూ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది.

వేసవి కానుకగా ఏప్రిల్ 24, 2026న "వాలా 2" థియేటర్లలోకి రానుంది. యూత్‌ఫుల్ కంటెంట్‌తో ఈ చిత్రం మరోసారి బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంటుందా అనే ఆసక్తి నెలకొంది.



## మళ్లీ తల్లికాబోతున్న దీపిక.. 'రాకా' షూటింగ్‌పై క్లారిటీ

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె మరోసారి తల్లికాబోతున్నారనే వార్తలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఇప్పటికే 2024లో కుమార్తెకు జన్మనిచ్చిన ఆమె, ప్రస్తుతం గర్భంతో ఉన్నట్లు సమాచారం.

ఈ వార్తతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నప్పటికీ, అల్లు అర్జున్ అభిమానుల్లో కొంత ఆందోళన నెలకొంది. ప్రస్తుతం అల్లు అర్జున్ నటిస్తున్న "రాకా" చిత్రంలో దీపిక హీరోయిన్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే. ఆమె గర్భంతో ఉండటం వల్ల షూటింగ్ ఆలస్యం అవుతుందేమోనని అభిమానులు భావిస్తున్నారు.

అయితే అలాంటి ఆందోళన అవసరం లేదని సమాచారం. "రాకా" సినిమా షూటింగ్ ఇప్పటికే ఎక్కువ భాగం పూర్తయ్యింది. ఈ చిత్రానికి అట్లీ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. పాన్ వరల్డ్ స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాలో అల్లు అర్జున్ భిన్నమైన లుక్‌లో కనిపించనున్నాడు.

గర్భంతో ఉన్నప్పటికీ, దీపిక ఈ సినిమాకు సంబంధించిన తన భాగాన్ని పూర్తి చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ షూటింగ్ కొనసాగించనున్నారు. సెట్ లో వైద్యుడిని కూడా ఏర్పాటు చేసినట్లు సమాచారం. దీనితో దర్శకుడు అట్లీ కుమార్, దీపికకు సంబంధించిన సన్నివేశాలను త్వరగా పూర్తి చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. తద్వారా సినిమా షూటింగ్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా చూసుకుంటున్నారు.

ఇక దీపిక ఒప్పుకున్న మరో భారీ ప్రాజెక్ట్ "కింగ్"లో షారుఖ్ ఖాన్ హీరోగా నటిస్తున్నారు. ఈ చిత్రంలో కూడా ఆమెకు యాక్షన్ సన్నివేశాలు ఉన్నట్లు సమాచారం.

మొత్తానికి, గర్భంతో ఉన్నప్పటికీ తన ప్రొఫెషనల్ కమిట్ మెంట్స్‌ను పూర్తి చేయాలని దీపికా పదుకొణె తీసుకున్న నిర్ణయం సినీ వర్గాల్లో ప్రశంసలు అందుకుంటోంది.

## రంగరాజన్ పాత్రతో ఆకట్టుకోనున్న మెగా బ్రదర్



మెగా బ్రదర్ నాగబాబు మరోసారి తన విలక్షణ నటనతో ప్రేక్షకులను మెప్పించేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన కీలక పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం "#కాస్ట్" ప్రస్తుతం టాలీవుడ్‌లో ఆసక్తికరంగా మారింది. ఎ.కె. జంపన్న దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో వరుణ్ సందేశ్, కాశికా కపూర్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు.

70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రూపొందుతున్న ఈ చిత్రం, ఒక వర్గానికి మాత్రమే పరిమితం కాకుండా సమాజంలోని ప్రస్తుత సామాజిక పరిస్థితులను ప్రతిబింబించేలా రూపొందుతున్నట్లు చిత్రబృందం చెబుతోంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది.

తాజాగా ఈ సినిమా నుంచి నాగబాబు ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ చిత్రంలో ఆయన "రంగరాజన్" అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. పోస్టర్‌లో నాగబాబు గంభీరమైన ముఖ కవళికలతో, ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తూ సినిమాపై అంచనాలను పెంచేశారు.

ఇప్పటివరకు ఎన్నో విభిన్న పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న నాగబాబు, ఈ సినిమాలో మరో కొత్త కోణాన్ని చూపించబోతున్నట్లు తెలుస్తోంది. సామాజిక అంశాలతో కూడిన ఈ చిత్రం విడుదలకు ముందే మంచి హైప్ సృష్టించడంతో సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

## "సూర్య బి పాజిటివ్" టీజర్ విడుదల..




కాళీ క్రాఫ్ట్స్, నిర్మలం డ్రామాస్ బ్యానర్లపై సుబ్బూ మాధవరపు దర్శకత్వంలో రూపొందిన "సూర్య బి పాజిటివ్" చిత్ర టీజర్‌ను హైదరాబాద్‌లో ఘనంగా విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ దర్శకులు కౌశిక్ పెగల్లపాటి, మురళీకాంత్ దేవసోత్ ముఖ్య అతిథులుగా హాజరై టీజర్‌ను ఆవిష్కరించారు.

ఈ చిత్రంలో చరణ్ పీసర్ల హీరోగా నటిస్తూ, డైలాగ్స్ రాయడంలో కూడా భాగస్వామ్యమయ్యారు. హీరోయిన్లుగా యానీ డయానా, దివ్య విశ్వకర్మ నటిస్తున్నారు.

టీజర్ ఆవిష్కరణ అనంతరం మాట్లాడిన మురళీకాంత్ దేవసోత్, ప్రస్తుతం సినిమా నిర్మాణం ఎంత కష్టమో తనకు తెలుసని, అమెరికాలో ఉద్యోగం చేస్తూనే దర్శకుడు ఈ చిత్రాన్ని పూర్తి చేయడం అభినందనీయమని అన్నారు. టీజర్‌లోని విజువల్స్, నటీనటుల ప్రదర్శన సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయని పేర్కొన్నారు. మరో అతిథి కౌశిక్ పెగల్లపాటి మాట్లాడుతూ, చరణ్ తనకు కాలేజీ జూనియర్ అని, హీరోగా నిలదొక్కుకోవాలనే పట్టుదల అతనిలో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. టీజర్ ఎడిటింగ్ స్టైల్ ప్రత్యేకంగా ఉందని, ఒక సాధారణ వ్యక్తి కథను ఆసక్తికరంగా చూపించారని చెప్పారు.

హీరో చరణ్ పీసర్ల తన ప్రసంగంలో భావోద్వేగానికి లోనయ్యారు. గతంలో మూడు సినిమాలు చేసినా విడుదల కాలేదని, ఈ నాలుగో ప్రయత్నంతో ప్రేక్షకుల ప్రేమను గెలుచుకోవాలని కోరారు. దర్శకుడు, నిర్మాత తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలిపారు. నటుడు రోహిత్ సత్యన్ మాట్లాడుతూ, ఈ సినిమా ద్వారా తొలిసారి స్టేజ్ పై మాట్లాడే అవకాశం దక్కిందని, తన పాత్ర సవాల్‌గా ఉందన్నారు. నటి సుజాత దీక్షిత్, ఈ చిత్రంలో తాను భిన్నమైన పాత్రలో కనిపించబోతున్నానని తెలిపారు. హీరోయిన్లు యానీ డయానా, దివ్య విశ్వకర్మ మాట్లాడుతూ, తెలుగు తెలియకపోయినా చిత్ర బృందం సహకారంతో ఈ సినిమా మంచి అనుభూతిని ఇచ్చిందన్నారు. ఈ చిత్రానికి అరుణ్ కుమార్ పర్వతనేని ఛాయాగ్రహణం అందించగా, గ్యాని సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ఎడిటింగ్ బాధ్యతలను మురళీకృష్ణ మన్యం నిర్వహించారు. వైవిధ్యమైన కథాంశంతో రూపొందిన "సూర్య బి పాజిటివ్" త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in